బుధవారం 7 అక్టోబరు 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





11 నుంచి శ్రీశైలంలో
దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు
సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఆహ్వానం
- వివరాలు 2 లో..



## స్థానిక సమరానికి కూటమి సమాయత్తం

- సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కీలక భేటీ
- ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రెండు గంటల పాటు చర్చలు
- మేయర్ అభ్యర్థులు, సీట్ల సర్దుబాటుపై ప్రాథమిక వ్యూహరచన

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు అధికార కూటమి కార్యాచరణను వేగవంతం చేసింది. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో స్థానిక ఎన్నికల వ్యూహాలు, కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై సమగ్రంగా చర్చించారు. అంతకు ముందు చంద్రబాబుతో కలిసి పవన్ కల్యాణ్ అల్పాహార విందులో పాల్గొన్నారు. అనంతరం ప్రధానంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. కూటమిలోని పార్టీల మధ్యస్థానాల సర్దుబాటు, ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలనే అంశంపై చర్చించారు. ప్రాధాన్యత కలిగిన కీలక కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థులుగా ఎవరినినిలబెట్టాలనే దానిపై ప్రాథమిక అభిప్రాయానికి వచ్చారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించారు. స్థానిక పోరులో కూటమి ఐక్యతను చాటుతూ, అన్ని స్థాయిలోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా నాయకులు ఈ వ్యూహరచన చేశారు.

## నెలకు రూ.2వేల కోట్ల విలువైన పనులు చేయాలి



- రాజధాని పనులపై నిర్మాణ సంస్థలతో సీఎం చంద్రబాబు సమీక్ష
- కేంద్రంతో సమన్వయం చేసుకుని ఔటర్ రింగ్ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని ఆదేశం

అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిలో నెలకు రూ.2వేల కోట్ల విలువైన పనులు జరిగేలా ప్రణాళికతో పనిచేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. అమరావతి పనులపై మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్ట్‌సంస్థల ప్రతినిధులతో నెలవారీసమీక్ష నిర్వహించారు. రాజధాని పరిధిలో చేపట్టిన 152 ప్రాజెక్టుల్లో 41వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. పనుల పరోగతిని, ఆయా ప్రాజెక్టుల స్థితిగతులను అధికారులు వివరించారు. గడిచిననెలలో రాజధానిలో రూ.1,345 కోట్ల విలువైన పనులు చేసినట్టు చెప్పారు. వీటిని రూ.2వేలకోట్లకు తీసుకువెళ్లాలని సీఎం కోరారు. రాజధాని నిర్మాణంతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును పట్టాలెక్కించాలన్నారు. దీనికోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాజధాని పనుల్లో ఎక్కడా అశ్రద్ధ, నిర్లక్ష్యం లేకుండా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని చెప్పారు. ఐకానిక్ భవనాల నిర్మాణాల విషయంలో ఎక్కడా పనులు ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సచివాలయ టవర్లు, అసెంబ్లీ భవనం ఐకానిక్‌గా ఉండాలన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ తరహాలోనే నిర్మాణ రంగంలోని వారికి ఆధునిక నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు.

## 18 నెలలు... 7 గిగావాట్లు... ఒక భారీ కర్మాగారం...




'పెట్టుబడి హామీ ఇచ్చింది మొదలు పూర్తిస్థాయి ఉత్పత్తివరకు కేవలం 18 నెలల్లోనే సాధించాం. నాయుడుపేటలో ఉన్న 'ప్రిమియర్ ఎనర్జీస్' యొక్క 7 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ కేంద్రాన్ని.... భారతదేశంలోనే అతిపెద్ద దానిని మీకు చూపించడానికి నేను గర్విస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ పనితీరు ఇలాగే ఉంటుంది... మాటలు తక్కువ, నిర్మాణం ఎక్కువ. వేగవంతమైన అనుమతులు. అంతకంటే వేగవంతమైన అమలు. నిజమైన కర్మాగారులు. నిజ మైన ఉద్యోగాలు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు...'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఇప్పుడు ఉత్పత్తి రూపంలో మనముందుంది.' అంటూ రాష్ట్ర విద్య, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా పేర్కొన్నారు.

## మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం



- ఈ ఆర్థిక సంవత్సరం 5 లక్షలకు పైగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం
- దేశంలోనే నెం.1 స్థానంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజ్
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.33,614 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించాం
- రుణాల రీపేమెంట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం
- ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్

6

## బీసీలకు 34 శాతం కోటా లక్ష్యంగా న్యాయపోరాటం

- సుప్రీంలో 50 శాతం పరిధిని అధిగమిస్తామనే నమ్మకం ఉంది
- బీసీలపై కక్షతో అడ్డుకునేందుకు వైసీపీ యత్నాలు
- రాజీలేని పోరాటంతో అదనపు రిజర్వేషన్లు సాధిస్తాం
- ఢిల్లీ ఏపీ భవన్‌లో కేంద్ర, రాష్ట్ర మంత్రుల సంయుక్త మీడియా సమావేశం
- పాల్గొన్న రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, పార్థసారథి, సత్యప్రసాద్

4



## ప్రకృతితో అనుసంధానం



- ప్రజలకు కొత్త అనుభూతి, గిరిజన యువతకు ఉపాధి
- ఎకో టూరిజం ప్రాజెక్టులతో మెరుగైన జీవనోపాధులు
- ఆరు నగర వనాలను వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

3



# ‘స్త్రీ శక్తి’ ప్రయాణాలు @ 100 కోట్లు



## మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): “మన ఆడబిడ్డల ఆదరణతో, మాతృమూర్తుల ఆమోదంతో ‘స్త్రీ శక్తి’ పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. గతఏడాది అగస్టు 15వ తేదీన ప్రారంభమైన ‘స్త్రీ శక్తి’ 100కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే ఈ పథకం రాష్ట్ర మహిళల జీవితాల్లో ఒక భాగమైపోయినట్లు అర్థమవుతోంది. చదువుకునే విద్యార్థినికి, ఉద్యోగానికి వెళ్లే మహిళకు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే ఆడబిడ్డలకు ఉచిత బస్సు శక్తినిచ్చింది. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, తమ అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే భరోసా అందిస్తోంది. ఇప్పటికి ఈ పథకం ద్వారా మహిళలు రూ. 3,550 కోట్ల మేర ఆదా చేసుకున్నారు. ఇలా ఆదా అయిన ప్రతి రూపాయి వారి పిల్లల చదువుకు, కుటుంబ అవసరాలకు, భవిష్యత్తుకు ఉపయోగపడాలన్నదే మా ఆకాంక్ష. ఈ పథకాన్ని ఆదరిస్తున్న మహిళలందరికీ కృతజ్ఞతలు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధ్యం చేయడంలో ఆర్టీసీ యాజమాన్యం, సిబ్బంది ఎంతో కృషి చేశారు.” అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక మాధ్యమం వేదికగా అందరికీ అభినందనలు తెలిపారు.

### 11 నుంచి శ్రీశైలంలో

## దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

### సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఆహ్వానం



అమరావతి (చైతన్యరథం): శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవాలయంలో జరగనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబును దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు ఆహ్వానం పలికారు. ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ మేరకు ఆలయ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో ఎం.శ్రీనివాస రావు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందించారు. ఆలయ పండితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం ఇచ్చారు. సీఎంకు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల చిత్రపటం, ప్రసాదాలను దేవాలయ అధికారులు అందించారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు కలిసి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందించారు. మంత్రి లోకేష్‌కు ఆలయ పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల చిత్రపటం, ప్రసాదాలను అందించారు.



## అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

### చంద్రబాబును కలిసిన దర్గా పెద్దలు



అమరావతి (చైతన్యరథం): కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును దర్గా పెద్దలు ఆహ్వానించారు. అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి కేఎస్ఎస్ అరీఫుల్లా హుస్సేనీ సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు హాజరవ్వాలని కోరారు. ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సీఎం ఆరా తీశారు. చంద్రబాబును కలిసిన వారిలో దర్గా మేనేజరు ఎండీ అలీఖాన్, సయ్యద్ గౌస్, అమీర్ బాషా తదితరులు ఉన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మంత్రి లోకేష్ స్వాగతం



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంగళవారం భేటీ అయ్యారు. సీఎంతో సమావేశం అయ్యేందుకు ఉండవల్లిలోని నివాసానికి వచ్చిన డిప్యూటీ సీఎంకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆత్మీయ స్వాగతం పలికారు. కారు వద్దకు వచ్చిన లోకేష్... పవన్‌కల్యాణ్‌ను ఆత్మీయంగా హత్తుకుని, కరచాలనం చేసి, ఇంట్లోకి తీసుకెళ్లారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం పలు అంశాలపై చర్చించుకున్నారు.

## శభాష్ గాయత్రీ

- దివ్యాంగ భక్తుడి ఆకలి తీర్చిన ద్వారకా తిరుమల ఆలయ మహిళా సిబ్బందికి సీఎం ప్రశంస
- మీ సహృదయానికి అభినందనలు అంటూ ‘ఎక్స్’లో పోస్ట్



అమరావతి (చైతన్యరథం): ద్వారకా తిరుమల ఆలయంలోని అన్నప్రసాద కేంద్రంలో ఈనెల 3వ తేదీన రెండు చేతులూలేని దివ్యాంగభక్తుడికి గాయత్రి అనే మహిళా సిబ్బంది స్వయానా అన్నం తినిపించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆమెపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. దివ్యాంగ భక్తుడు సత్యనారాయణకు అన్నం తినిపించే వీడియోను సీఎం చంద్రబాబు ‘ఎక్స్’లో పోస్టుచేశారు. ‘శభాష్‌గాయత్రీ.! ద్వారకా తిరుమల అన్నప్రసాద కేంద్రంలో చేతులు లేని దివ్యాంగ భక్తుడికి అన్నం తినిపించి ఆకలి తీర్చిన మీ సహృదయానికి వందనాలు. “మానవ సేవే మాధవ సేవ” అని చాటి చెప్పిన మీ స్ఫూర్తి అభినందనీయం’ అని సీఎం పేర్కొన్నారు.

చైతన్యరథం





# ప్రభుత్వ పథకాలన్నింటిలో 'స్త్రీ శక్తి'కి విశేష ఆదరణ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మహిళల కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతూ 100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని అధిగమించడం పట్ల రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. గతేడాది ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదుకావడం పథకం విజయానికి నిదర్శనమన్నారు.




- 100 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చారిత్రాత్మక మైలురాయి
- భారం కాదు బాధ్యతతో కొనసాగిస్తాం
- మహిళలకు ఆర్థిక భరోసా సీఎం చంద్రబాబు లక్ష్యం
- రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని, ఇప్పటివరకు మహిళలకు సుమారు రూ.3,550 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలిగిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలపై కుటుంబ ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గిస్తూ, వారి అవసరాలకు ఆర్థిక స్వేచ్ఛను కల్పించడంలో ఈ పథకం కీలకంగా మారిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను బాధ్యతగా భావించి అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మంత్రి స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా కొంత భారాన్ని భరిస్తున్నప్పటికీ, మహిళల సంక్షేమం విషయంలో వెనకడుగు వేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తున్నారని తెలిపారు.

ఆర్టీసీపై నెలకు సుమారు రూ.160 కోట్ల మేర భారం పడుతున్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం రూ.2,160 కోట్లను ఆర్టీసీకి చెల్లించడం ద్వారా పథకం అమలుకు పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రభుత్వానికి భారంగా భావించకుండా, మహిళల సంక్షేమం కోసం బాధ్యతగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

### ప్రభుత్వ పథకాలన్నింటిలోనూ విశేష ఆదరణ

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో స్త్రీ శక్తి పథకం మహిళల నుంచి అత్యధిక ఆదరణ పొందుతున్న పథకాలలో ఒకటిగా నిలిచిందని మంత్రి మండిపల్లి అన్నారు. మహిళలు తమ కుటుంబ అవసరాల కోసం, ఉద్యోగాలు, విద్య, వైద్యం, ఇతర పనుల నిమిత్తం ప్రయాణించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. మహిళల ప్రయాణ ఖర్చు తగ్గడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితికి కూడా ఈ పథకం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మహిళా సంక్షేమం, సాధికారతకు స్త్రీ శక్తి పథకం ఒక మంచి ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు.

### ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు

స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బందికి మంత్రి మండిపల్లి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రోజుకు లక్షలాది మంది మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఆర్టీసీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా మహిళలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆర్టీసీని బలోపేతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. స్త్రీ శక్తి పథకం మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని, మహిళలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.

స్త్రీ శక్తి పథకాన్ని ఆదరిస్తూ 100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని చేరేలా చేసిన రాష్ట్రంలోని ప్రతి మహిళకు మంత్రి మండిపల్లి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆశీస్సులతో ఈ పథకం మరింత విజయవంతంగా కొనసాగుతుందని ఆయన ఆకాంక్షించారు.

## ప్రకృతితో అనుసంధానం..

# ప్రజలకు కొత్త అనుభూతి, గిరిజన యువతకు ఉపాధి

- ఎకో టూరిజం ప్రాజెక్టులతో మెరుగైన జీవనోపాధులు
- నగర వనాల్లో స్వచ్ఛమైన, ఆహ్లాదకర వాతావరణం
- అన్ని ప్రాంతాలను కలిపేలా పర్యాటక అభివృద్ధి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉద్ఘాటన
- 6 నగర వనాలను వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రజలను ప్రకృతిలో మమేకం చేసి, వారికి మరిచిపోని మధురానుభూతులను ఇవ్వడంతోపాటు, గిరిజనులకు ఎకో టూరిజం జీవనోపాధులు మెరుగుపర్చడం ప్రభుత్వం ముందున్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు, బాపట్ల తీర ప్రాంత అందాల నుంచి కోటప్పకొండ ఆధ్యాత్మిక ప్రయాణం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పర్యాటక కళను తీసుకొచ్చేలా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితమైన 6 నగర వనాలను మంగళవారం ఉప ముఖ్యమంత్రి మంగళగిరి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ గా ప్రారంభించారు.

ఈ సందర్బంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నగర వన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 19 నగరవనాలుంటే, ఇప్పుడు ప్రారంభించిన ఆరు నగరవనాలతో కలిపి 25 నగరవనాలు రాష్ట్రంలో ఏర్పడతాయన్నారు. 305 హెక్టార్లలో, రూ.13 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ నగరవనాలు కేవలం మొక్కలు నాటే ప్రాంతాలుగా కాకుండా, ప్రజలను ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్లే మార్గంగా ఉంటాయి. నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ లు, పిల్లలు ఆడుకునే ప్రాంతాలు, జిమ్ పరికరాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో,



స్వచ్ఛమైన అందాలతో నగరవనాలు ఆరోగ్యం, ఆహ్లాదం, ప్రకృతి అవగాహన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాం. బాపట్ల, చీరాల తీర ప్రాంత పర్యాటక వనాలుగా ఉంటే, కోటప్పకొండ ఆధ్యాత్మిక సువాసనలతో విరాజిల్లుతుంది. వినుకొండ, దేవరంపాడు, మాచర్లలో ఏర్పాటు చేసే నగరవనాలు ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రకృతికి దగ్గరయితే, ఆరోగ్యం దగ్గరవుతుంది. ప్రకృతి అర్థమైతే, పరిరక్షణ బాధ్యత పెరుగుతుంది. ఇది ప్రకృతి నియమమని పవన్ స్పష్టం చేశారు.

### సత్సంకల్పంతో ముందడుగు వేస్తున్నాం

రాష్ట్రంలో ఎకో టూరిజం పెరగడం వల్ల గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెలిగోడు జంగిల్ సఫారీతో సరికొత్త అనుభూతులు లభిస్తాయి. మారేడుమిల్లి ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ ద్వారా తూర్పు కనుమల అటవీ అందాలను, ప్రకృతి పరిమళలను ప్రజలకు చేరువ చేస్తాం. గిరిజన సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు ప్రయత్నిస్తాం. దీనివల్ల గిరిజనుల జీవన విధానంలో మంచి మార్పులు వస్తాయని సత్సంకల్పంతో పని చేస్తున్నాం. ప్రకృతిని ప్రేమించాలి.. భావితరాలకు బహుమతిగా ఇవ్వాలనేది మా సంకల్పం. దీనికి కట్టుబడి పనిచేస్తాం. దీనికి ప్రజలు తమవంతుగా సహకరించాలన్నారు.

అనంతరం ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ రూపొందించిన వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రీ టాన్స్‌లోకేషన్ మాన్యూవల్ పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ దేశంతోనే మొదటిసారి "ఈకోలిప్టస్ పల్ప్ ఉడ్ ప్లాంటేషన్" విభాగంలో అనుసరిస్తున్న సుస్థిర నిర్వహణ పద్ధతులకు గుర్తింపుగా సాధించిన ప్రమాణ్ సర్టిఫికేట్ ను డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అటవీశాఖ అధికారులు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదల నాగేంద్రబాబు, వినుకొండ, రంపచోడవరం, చీరాల ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మిరియాల శిరీష, మద్దులూరి మాలకొండయ్య, అటవీ, పర్యావరణ శాఖ చీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ చలపతిరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, సీఈవో ఏపీ గ్రీన్ బీఎన్ఎన్ మూర్తి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఎకో టూరిజం ఈడీ నందిని సలారియా, అటవీశాఖ ఐటీ సలహాదారుల పి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం కోటా లక్ష్యంగా న్యాయపోరాటం

- సుప్రీంలో 50 శాతం పరిధిని అధిగమిస్తామనే నమ్మకం ఉంది
- బీసీలపై కక్షతో అడ్డుకునేందుకు వైసీపీ యత్నాలు
- రాజీలేని పోరాటంతో అదనపు రిజర్వేషన్లు సాధిస్తాం
- ఢిల్లీ ఏపీ భవన్‌లో కేంద్ర, రాష్ట్ర మంత్రుల సంయుక్త మీడియా సమావేశం
- పాల్గొన్న రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, పార్థసారథి, సత్యప్రసాద్
- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చలు



న్యూఢిల్లీ (చైతన్యరథం): స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని స్పష్టం చేస్తూ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం వారు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

**సుప్రీంకోర్టు ద్వారా ప్రభుత్వం పోరాటం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

సుప్రీంకోర్టు ద్వారా న్యాయం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని అధిగమించేందుకు తగిన ఎంపైరికల్ డేటాతో సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటి ఆధారంగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీసీల మీద వైసీపీకి ఉన్న రాజకీయ,వ్యక్తిగత కక్ష కారణంగానే వారికి దక్కాల్సిన అవకాశాలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించడం, వారికి రాజకీయంగా, సామాజికంగా ఎప్పుడూ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన సిద్ధాంతమని ఆయన స్పష్టం చేశారు.

34 శాతం బీసీ రిజర్వేషన్లు అమలులోకి వస్తే సుమారు 16,800 పోస్టులు అదనంగా బీసీలకు దక్కుతాయని ఆయన తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌ల నుంచి మొదలుకుని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మేయర్‌లుగా ఎదిగి, భవిష్యత్తులో చట్టసభలకు, అసెంబ్లీలు, పార్లమెంట్‌కు వెళ్లే గొప్ప అవకాశాలు వీరికి లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

**రాజీలేని పోరాటం: రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు**

బలహీన వర్గాల రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, తదుపరి న్యాయ పోరాట వ్యూహాలపై చర్చించేందుకు ముగ్గురు మంత్రుల బృందం ఢిల్లీకి వచ్చినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. న్యాయ నిపుణుల సలహాలు, సుప్రీంకోర్టు గత తీర్పులు, వివిధ కమిషన్‌ల రిపోర్టుల ఆధారంగా భవిష్యత్తు కార్యాచరణపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, దేవదత్ కామత్‌తో మంత్రుల బృందం చర్చించినట్లు ఆయన వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘకాలం పాటు బలహీన వర్గాలను కేవలం ఓట్ల యంత్రాలుగానే చూశారని, ఆ పరిస్థితులను మార్చడానికి స్వర్గీయ ఎన్.టి. రామారావు ఆ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించారని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం పెంచేందుకు 1987లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తొలిసారిగా స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, ఆ తర్వాత 1995లో చంద్రబాబు నాయుడు దానిని 34 శాతానికి పెంచారని ఆయన వివరించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చట్ట సవరణ చేయకుండా, కనీసం సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా బలహీన వర్గాల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని మంత్రి తీవ్రంగా విమర్శించారు. బలహీన వర్గాలకు ఇచ్చిన మాట ప్రకారం, ఏ పరిస్థితుల్లోనైనా 34 శాతం రిజర్వేషన్లు దక్కేలా న్యాయపోరాటం చేస్తామని, ఇందుకోసం సుప్రీంకోర్టులో కేసు వేసి నిపుణుల సలహాలతో ముందుకు వెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

**బీసీ అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కొలుసు పార్థసారధి**

రాష్ట్రంలో బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడంతో పాటు, వారికి రాజకీయ, ప్రజాస్వామ్య సాధికారత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. బలహీన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు సాధించాలనే పట్టుదలతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఆయన స్పష్టం చేశారు. బలహీన వర్గాలకు కేవలం ఏదో రిజర్వేషన్ ఇవ్వాలనే కాకుండా, రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గతంలో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించారని ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర శాసనసభకు ఉన్న అధికారాలు, 243 డీ, 243 టీ సెక్షన్ల ప్రకారం బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. స్థానిక సంస్థల్లోనూ బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం దక్కాలనే ఉద్దేశంతోనే తాము పోరాడుతున్నట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ రాష్ట్రం బాగుండాలని కోరుకుంటారన్నారు. ప్రపంచం మెచ్చిన నాయకుడైన ఆయన ఎన్నో రాజకీయ ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షిస్తారన్నారు. అందుకే ఇప్పటివరకు పలు మార్లు ఢిల్లీకి ఆయన వచ్చారన్నారు. సీఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులుగా ఆయన సమాధానం ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ పాల్గొన్నారు

# హామీ ఇచ్చా.. ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తా

**ప్రత్యేక ప్రణాళికతో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి - అభివృద్ధిలో రాష్ట్రానికి ఆదర్శంగా బందరుని తీర్చిదిద్దుతా - మచిలీపట్నం రూరల్ మండల పర్యటనలో మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్యరథం): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలికవసతులు కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పలు గ్రామాల్లో వీబీ జీ రాం జీ, సాస్కీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు మంగళవారం మంత్రి శంకుస్థాపనలు చేశారు. మచిలీపట్నం రూరల్ మండలం పెదపట్నం గ్రామంలో 1వ నెంబర్ బ్రాంచ్ కెనాల్ మీద రూ.12.50 లక్షల వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంబించారు.

కానూరు గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి సారంగపాలెం వరకు రూ.1.56 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తాళ్లపాలెం గ్రామంలో పెదపట్నం రోడ్డు నుండి జొన్నలవారిమోది వరకు రూ.2.49 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బొర్రపోతుపాలెం గ్రామంలో ఏలూరు రోడ్డు నుండి బొర్రపోతుపాలెం వరకు రూ.1.04కోట్ల సాస్కీ నిధులతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కరగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలోని క్యాంబెల్ పేట నుండి బందరు పోర్టు వరకు రూ.2.73 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణ పనులకు శంకస్థాపన చేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు, ప్రజారోగ్యానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో మురికి కాలువల్లో పారతో మట్టి తీసే పరిస్థితి కూడా లేదు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో రూ.164 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేశాం. రూ.54 కోట్ల ఆర్ అండ్ బీ నిధులు, రూ.80 కోట్ల ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు కలిపి మొత్తంగా రూ.330 కోట్ల పనులు చేశాం. ఇవే రోడ్లు గతంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు వేశాం. మళ్లీ ఇప్పుడు మనం అధికారంలోకి వచ్చాక వేస్తున్నాం.

ఇంటింటికీ మంచి నీళ్లు ఇవ్వడానికి 'జల్ జీవన్ మిషన్' ద్వారా రూ.80 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్ ఇస్తున్నాం. సంవత్సర కాలంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచి నీరు ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటోంది. ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన. 'వీబీ జీ రామ్‌జీ నిధుల్లో 50% కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం 50% ఖర్చు చేస్తున్నాం. తాజాగా రూ. 11 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా పనులు ప్రారంభించారు. సిమెంట్ రోడ్లన్నీ కూడా అభివృద్ధి చేసుకుంటున్నాం.

మరోవైపు సంక్షేమ పథకాలను కూడా పకడ్బందీగా అమలు చేస్తున్నాం. హామీ మేరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అందిస్తున్నాం. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలన్నీ పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వీటికి తోడుగా మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, చేనేతల సేవలో వంటి పథకాలు అమలు చేస్తున్నాం. మత్స్యకార సేవలో కార్యక్రమం ద్వారా బోటులో ఎంతమంది కళాసీలు ఉంటే అంతమందికీ 20 వేల రూపాయల చొప్పున అందిస్తున్నాం.

కానూరు గ్రామంలో తల్లికి వందనం పథకం ద్వారా 55 లక్షల 51 వేలు, 29 మంది ఆటో డ్రైవర్లకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 15 లక్షలు అందించాం. 427 పెన్షన్లు ఇస్తున్నాం. ప్రతి నెల పెన్షన్ల రూపంలో ఈ గ్రామంలో 20 లక్షలు అందిస్తున్నాం. 2014 లో నియోజకవర్గంలో 20 వేల పెన్షన్లు ఉన్నాయి, ఇప్పుడు 30 వేల పెన్షన్లు దాటాయి. అప్పుడు ఇచ్చే పెన్షన్ల కోసం రూ.34 లక్షలు ఇస్తే.. ఇప్పుడు ఏకంగా రూ.13 కోట్లు చెల్లిస్తున్నాం. 34 లక్షలు ఎక్కడ, 13 కోట్లు ఎక్కడ. రాష్ట్రం మొత్తం 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. ప్రతి నెలా రూ.2,770 కోట్లు చొప్పున సంవత్సరానికి రూ.35 వేల కోట్లుపెన్షన్ కే ఇస్తున్నాం.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇళ్ల నిర్మాణ పథకాన్ని గాలికి వదిలేశారు. కేంద్రం ఇచ్చే రూ.1,80,000 మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో.. రూ.50,000 పెంచి రూ.2,30,000 ఇస్తున్నాం. గత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు, వాటి స్థితిగతులన్నీ తెలుసుకున్నాం. త్వరలోనే కొత్తగా ఇళ్లు మంజూరు చేస్తాం. తాజాగా త్రీడీ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంబించారు. అదే మోడల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు చేపడతాం.

దశాబ్దాల పోరాటాల ఫలితంగా బందరు పోర్టు పూర్తవుతోంది. కొత్తగా పరిశ్రమలు కూడా వస్తున్నాయి. రూ.8000 కోట్ల పెట్టుబడితో 'గోవా షిప్‌యార్డ్' సంస్థ బందరు వస్తోంది. 10,000 మందికి ఉద్యోగాలు వస్తాయి. అది పూర్తయితే మన పిల్లలు ఉద్యోగాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన పని లేదు. ఇక్కడే ఉద్యోగాలు వచ్చేలా నైపుణ్యాలు నేర్పిస్తాం. రెండు సంవత్సరాల్లో గోవా షిప్ యార్డ్ కంపెనీ నిర్మాణం పూర్తవుతుంది. బందరు నుండి కృత్తివెన్నును కలుపుతూ ఓడపల్లి వరకు ఒక నేషనల్ హైవే కోసం ప్రయత్నం చేస్తున్నాం. అది వస్తే మన ఏరియా అంతా బంగారమవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, రూరల్ పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్యరథం

# మీ విజయం ఏపీకి గర్వకారణం

- మరిన్ని విజయాలతో దేశానికి, రాష్ట్రానికి పేరు తేవాలి
- కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత శంకు కృపారావుకు ఎమ్మెల్సీ వర్ల రామయ్య అభినందనలు




అమరావతి (చైతన్యరథం): కెనడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ గేమ్స్ పోటీల్లో పవర్‌లిఫ్టింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారుడు శంకు కృపారావును టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య అభినందించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం వర్ల రామయ్యను శంకు కృపారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను అభినందించిన వర్ల రామయ్య.. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. కృపారావు సాధించిన ఈ ఘన విజయం రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందన్నారు. క్రీడల్లో కఠోర శ్రమ, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగితే అంతర్జాతీయ స్థాయిలోనూ విజయాలు సాధించవచ్చని ఆయన తెలిపారు. కృపారావు ప్రతిభకు ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కృపారావు మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వర్ల రామయ్య ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పట్టుదలతో ముందుకు సాగి రాష్ట్రానికి మరిన్ని పతకాలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కృపారావు చెప్పారు.

## బొబ్బిలిలో బెర్రీ పరిశ్రమలో ఫర్నేస్ పేలుడు

- ఘటనపై స్పందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- భారీ ప్రాణనష్టం తప్పడం పట్ల ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం
- భద్రతపై మంత్రి కీలక ఆదేశాలు



బొబ్బిలి (చైతన్యరథం): విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ పరిశ్రమలో జరిగిన భారీ ఫర్నేస్ పేలుడు ఘటనపై రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిక శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించారు. పేలుడు సమయంలో అక్కడ కార్మికులు, ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పిందని తెలియగానే మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికార యంత్రాంగంతో సంప్రదింపులు జరిపారు. స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన, జిల్లా కలెక్టర్, ఫైర్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై పూర్తి వివరాలు ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడం అదృష్టం. అయితే ఇది చిన్న విషయం కాదు. ఫర్నేస్ ఎందుకు పేలింది.. సాంకేతిక లోపమా.. నిర్వహణ లోపమా.. భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా.. అనే దానిపై లోతైన విచారణ జరగాలని అని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లోనూ భద్రతా ప్రమాణాలపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, ఇటువంటి ప్రమాదాలు ఏ పరిశ్రమలోనూ పునరావృతం కాకుండా పరిశ్రమలను పరిశీలించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కోరారు.

## అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు

- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన సేవలు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడి



తూర్పు నాయుడుపాలెం/ప్రకాశం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంగళవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కొండపి ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ప్లేట్లు, గ్లాసులు, సిబ్బందికి యూనిఫామ్ మంత్రి పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీలుగా పదోన్నతులు పొందిన ముగ్గురు ఆయాలకు మంత్రి పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....అంగన్వాడీ కేంద్రాలలో మహిళలు, పిల్లలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించడంతో పాటు వాటికి స్వంత భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో అంగన్వాడీ సెంటర్లు అత్యంత దయనీయ స్థితిలో ఉండేవి..సకాలంలో టీచర్లకు జీతాలు చెల్లించే వారు కాదు.. టీచర్లు నానా ఇబ్బందులు పడేవారన్నారు. నేడు క్రమంగా ప్రతీనెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం రెండు సార్లు జీతాలు పెంచిందని గుర్తుచేశారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చింది కూటమి ప్రభుత్వమని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అంగన్వాడీ సెంటర్లలో టెలివిజన్, ఆర్వో వాటర్, ఆట వస్తువులు, చార్టులు ఇండక్షన్ స్టవ్, నాణ్యమైన వంట పాత్రలు ఇలా అన్ని వసతులు కల్పించినట్టు చెప్పారు. అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుతున్నాయని మంత్రి వివరించారు.

### రూ.30 లక్షల పైప్‌లైన్ ధ్వంసం..

# వైసీపీ మద్దతుదారు దౌర్జన్యం

- గత ప్రభుత్వ హయాంలో రీసర్వేలో భూమి రికార్డుల గందరగోళం
- దాడిచేసి బడ్డీకొట్టు కబ్జా
- రైల్వేస్థలంలో 250 కుటుంబాల నివాసం, ఖాళీ చేయాలంటూ నోటీసులు
- న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వారి సమస్యలను చెప్పుకున్నారు. ప్రజల నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం తిమ్మసముద్రానికి చెందిన టి. వెంకట సురేశ్ అర్జీ ఇస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్ 40-1లో 234 సెంట్ల భూమి జయలక్ష్మి పేరుతో ఉండేదన్నారు. అలాగే సర్వే నంబర్ 40-2లో 250 సెంట్ల భూమి దేవి సుభద్రమ్మ పేరుతో ఉన్నట్లు పాత రికార్డుల్లో ఉంది. అయితే 2023 రీసర్వే అనంతరం సర్వే నంబర్ 40-1కు సంబంధించిన ఎల్‌పీఎం నంబర్ 2827లో దేవి సుభద్రమ్మ పేరు నమోదు చేశారు. వాస్తవంగా దేవి సుభద్రమ్మ అనుభవంలో లేని భూమి కూడా ఆమె పేరుపై నమోదు చేశారు. సదరు కుటుంబ సభ్యులు గతంలోనే వారి భూమిని విక్రయించారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కొందరు రైతులు అర్జీ ఇస్తూ.. తమ ప్రాంతంలో వర్షాలు లేక బోర్లలో నీరు ఎండిపోవడంతో పంటలు, పండ్ల మొక్కలు కాపాడుకోవడానికి సమీపంలోని ఏనుగుమర్రి చెరువు నుంచి నీటిని తీసుకురావడానికి రైతులంతా కలిసి సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేసి పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎవరి పొలాలకు, పంటలకు ఇబ్బంది కలగకుండా వంక మధ్యలో పైప్‌లైన్ వేశాం. అయితే సర్వే నంబర్ 295కు చెందిన వైసీపీకి చెందిన శ్రీనివాసులు పైప్‌లైన్‌కు పదేపదే అడ్డుపడుతున్నారు. అధికారులు పరిశీలించినప్పుడు ఆయన పొలానికి ఎలాంటి ఇబ్బంది లేదని కూడా చెప్పారు. తాజాగా 02-10-2026న పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి, స్టార్టర్ బాక్సులను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. దీంతో మా పంటలకు నీరు అందడం లేదు. ఈ ఘటనపై విచారణ జరిపించి, రైతులకు రక్షణ కల్పించి, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

గుంటూరుకు చెందిన షానిక్ హసనాబి అర్జీ ఇస్తూ... నగరంలోని నెహ్రూ నగర్ 1వ లైన్, సీతానగరం రైల్వే గేటు ఏరియాలో తాను గత పది ఏళ్లుగా కూరగాయల బడ్డీకొట్టు నడుపుతున్నానని తెలిపారు. దీని ద్వారానే మా కుటుంబం జీవనం సాగిస్తోంది. లేబర్ లైసెన్స్ సైతం కడుతున్నాను. అయితే ఈ మధ్య ఒక వ్యక్తి నన్ను తీవ్రంగా కొట్టి బలవంతంగా బడ్డీకొట్టును కబ్జా చేశారు. అంతే కాకుండా నాపై దుర్భాషలు ఆడుతూ నా స్థలం లాక్కొన్నారు. తిరిగి తన స్థలం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

విజయవాడ పశ్చిమ నియోజక వర్గం చిట్టినగర్ కాలనీకి చెందిన తోట వసంత కుమారి అర్జీ ఇస్తూ.. వాగు సెంటర్ కొండ మీదకు తాము 250 మెట్లు ఎక్కాల్సి వస్తోందన్నారు. అలానే పైకి తాగు నీరు తీసుకెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నాం. ఇతర మౌలిక వసతులు కూడా అంతంత మాత్రమే. దీని వలన అనేక ఇబ్బందులు పడుతున్నాం. కొండపైన ఉండే తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ దక్షిణ నియోజకవర్గానికి చెందిన కొందరు గ్రీవెన్స్‌లో అర్జీ ఇస్తూ.. జ్ఞానాపురం ఎర్రగెడ్డ సమీపంలో 41వ వార్డులో గత 50 సంవత్సరాలుగా రైల్వే స్థలంలో అద్దె చెల్లిస్తూ వివిధ చేతివృత్తులు, వాహనాల మరమ్మతులు, ఫాబ్రికేషన్, గ్రిల్స్, వాటర్ ట్యాంకర్లు, టింకరింగ్ తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇక్కడ సుమారు 250 కుటుంబాలు జీవిస్తున్నాయి. అయితే ఈ మధ్య రైల్వే అధికారులు ఈ స్థలం ఖాళీ చేయాలని చెబుతున్నారు. కొన్ని ఇళ్లను ఇప్పటికే బలవంతంగా కూల్చి వేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి 250 కుటుంబాలకు ఆశ్రయం కల్పించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఈ ఆర్థిక సంవత్సరం 5 లక్షలకు పైగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం
- దేశంలోనే నంబర్ 1 స్థానంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజ్
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.33,614 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించాం
- రుణాల రీపేమెంట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం
- ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అమరావతి (చైతన్యరథం): మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ను కేవలం రుణాలు పొందే సంఘాలుగా కాకుండా.. ఉత్పత్తి, వ్యాపారం, మార్కెటింగ్ రంగాల్లో రాణించే గ్రామీణ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ అత్యుత్తమ స్థాయిలో ఉండటం గర్వకారణమన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.33,614 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించి దేశంలోనే రికార్డు సృష్టించామని, తద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ రుణాలపై ఇప్పటివరకు బ్యాంకులు వసూలు చేస్తున్న ప్రాసెసింగ్ చార్జీలు, ఇన్‌స్పెక్షన్ చార్జీలు, లెడ్జర్ ఫోలియో చార్జీలను ఎత్తివేస్తున్నామని మంత్రి ప్రకటించారు. దీనివల్ల ఒక్కో ఎస్‌హెచ్‌జీ సంఘానికి సంవత్సరానికి సుమారు రూ.32,500 వరకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఎస్‌హెచ్‌జీ రుణాల రీ పేమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోందని మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్‌పీఏ సగటు 1.78 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అది కేవలం 0.67 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. అలాగే రూ.23 కోట్లకు పైగా స్త్రీనిధి ప్రోత్సాహకాలను విడుదల చేశామని మంత్రి తెలిపారు.

### వీవోఏల పనిభారం తగ్గించేందుకు 'ఈ-నారీ'

క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల (వీవోఏ) పనిభారాన్ని తగ్గించడంతో పాటు వారి కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు 'ఈ-నారీ' వ్యవస్థను ప్రవేశపెట్టామని మంత్రి తెలిపారు. సాంకేతికతను వినియోగించడం ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం పెరుగుతుందని తెలిపారు.

### విజయవాడలో జాతీయ సరస్ ఆజీవికా మేళా

ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిని దాటి దేశంలోనే తొలిసారిగా విజయవాడ పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ ఆజీవికా మేళా నిర్వహించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో మార్కెట్ చేసుకునేందుకు ఈ మేళా ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఈ మేళాలో సుమారు 600 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో ఇతర రాష్ట్రాల మహిళా పారిశ్రామికవేత్తల కోసం 250 స్టాళ్లు, ఆంధ్రప్రదేశ్ ఎస్‌ఆర్‌ఎల్‌ఎం మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350 స్టాళ్లు కేటాయిస్తున్నామని వివరించారు.

### గ్రామం నుంచి జాతీయ మార్కెట్ వరకు

'ఎస్‌హెచ్‌జీ మహిళ నుంచి గ్రామీణ పారిశ్రామికవేత్తగా – గ్రామం నుంచి జాతీయ మార్కెట్ వరకు' అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, వారి ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, బ్యాంకింగ్ సదుపాయాలను విస్తరించడం ద్వారా మహిళా సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతో గత ప్రభుత్వ విధ్వంసం నుంచి వికాసం వైపు, నిరాశ నుంచి నమ్మకం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలకు ఆర్థికంగా మరింత బలమైన భవిష్యత్తును అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# 2029 నాటికి పేదలందరికీ సొంతిల్లే కూటమి లక్ష్యం

- సీఎం చంద్రబాబుతోనే పేదల ఇంటి కల సాకారం
- రెండేళ్ళలోనే రికార్డుస్థాయిలో 5.50 లక్షల గృహప్రవేశాలు
- దేశంలో తొలిసారి 3డీ టెక్నాలజీతో తెనాలిలో ఇళ్ల నిర్మాణం
- 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- సెంటు పట్టా పేరుతో జగన్ ఐదేళ్ల దోపిడీ రూ.7 వేల కోట్లు
- ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత



అమరావతి (చైతన్యరథం): 2029 నాటికి రాష్ట్రంలో ప్రతి పేదవారికి సొంతిల్లు కట్టించి వారి కలలను సాకారం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ ఐదేళ్లలో సెంటు పట్టా పేరుతో రూ.7 వేల కోట్లు దోచుకున్నారు కానీ.. ఒక్క ఇల్లు కూడా కట్టలేదని దుయ్యబట్టారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదు.. అది తరతరాలకు భద్రత, పిల్లల భవిష్యత్తుకు పునాది, పేదల ఆత్మగౌరవానికి ప్రతీక. పేదరికం నుంచి స్థిరత్వం వైపు అడుగులు వేయడానికి సొంత ఇల్లు ఎంతో కీలకం. పేదల సంక్షేమం, అభివృద్ధికి ఎప్పుడూ పెద్దపీట వేసే సీఎం చంద్రబాబు నాయుడు.. గృహనిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతి అర్హుడైన పేదవాడికి సొంతింటి కలను సాకారం చేయాలన్న చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పీతల సుజాత తెలిపారు.

### సెంటు పట్టా పేరుతో రూ.7 వేల కోట్ల దోపిడీ

2014-19 మధ్యకాలంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దాదాపు 12 లక్షల ఇళ్లను నిర్మించి పేదల సొంతింటి కలను సాకారం చేసింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసింది. అంతకు ముందు చంద్రబాబు ప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణానికి సిద్ధం చేసిన సుమారు 6 లక్షల ఇళ్లను రద్దు చేసింది. అంతేకాదు.. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో పట్టాలు ఇచ్చారు. కొండలు, గుట్టలు, ఊరికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాల్లో, కనీస సౌకర్యాలు లేని భూముల్లో స్థలాలు కేటాయించారు. సెంటు స్థలం పేరుతో పేదలను మోసం చేస్తూ, భూముల చదును పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారు. సెంటు పట్టాల పేరుతో జరిగిన అక్రమాల విలువ దాదాపు రూ.7 వేల కోట్లు. పేదలకు ఇళ్లు నిర్మించ లేని జగన్.. బెంగళూరులో రూ.300 కోట్లతో ప్యాలెస్, విశాఖ రుషి కొండలో రూ.500 కోట్లతో మరో ప్యాలెస్ నిర్మించుకున్నారు. పేదల ఓట్లు కావాలి కానీ పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న చిత్తశుద్ధి మాత్రం జగన్ రెడ్డికి లేదనే విషయం ప్రజలు గ్రహించాలని సుజాత కోరారు.

### పేదల సొంతింటి కల సాకారం చంద్రబాబుతోనే సాధ్యం

కూటమి ప్రభుత్వం మాత్రం గత ప్రభుత్వంలా పేదలకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయడం లేదు. పార్టీలు చూడకుండా, అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ విధానం. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తూ పేదలకు అండగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 5.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించింది. దశాబ్దాలుగా పరిష్కారం కాని ఇళ్ల స్థలాల సమస్యకు కూడా పరిష్కారం చూపుతూ "పేదలకు పట్టాభిషేకం" కార్యక్రమం ద్వారా సుమారు రూ.52 వేల కోట్ల విలువైన 58 వేల పట్టాలను పంపిణీ చేసి, లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పించింది. పీఎంఏవై అర్బన్ 2.0 కింద తొలుత రాష్ట్రానికి 75 వేల ఇళ్లు మాత్రమే మంజూరయ్యే పరిస్థితి ఉండగా, కేంద్రంతో చర్చించి చంద్రబాబు నాయుడు 3 లక్షల ఇళ్లను రాష్ట్రానికి సాధించారు. తాజాగా తెనాలి సమీపంలోని బుర్రిపాలెంలో కేంద్ర మంత్రి చౌహాన్‌తో కలిసి 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీని వినియోగించి బుర్రిపాలెంలో 177 ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పీఎంఏవై అర్బన్ 2.0 అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అందించిన అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు రావడం కూడా రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

### అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ కుట్రలు

ఒకవైపు పేదల ఇంటి తలుపు తట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుంటే.. మరోవైపు తాడేపల్లి ప్యాలెస్ నుంచి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు అడ్డుపడేందుకు కుట్రలు జరుగుతున్నాయి. ఈ తేడాను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారు. పేదల జీవితాలను చీకటిమయం చేసింది గత ప్రభుత్వం.. పేదల ఇంటి తలుపు తట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నది కూటమి ప్రభుత్వం. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు, సొంత చిరునామా ఉండాలన్నదే చంద్రబాబు లక్ష్యం. 2029 నాటికి ప్రతి అర్హమైన పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించే దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. పేదల సొంతింటి కలను సాకారం చేయడం కూటమి ప్రభుత్వ బాధ్యతగా భావిస్తోందని సుజాత స్పష్టం చేశారు.

## స్త్రీ శక్తి పథకానికి మహిళల జేజేలు

- పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా
- 100 కోట్లు దాటిన ఉచిత బస్సు ప్రయాణాలు
- ఇప్పటికి రూ.3,552 కోట్లు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వం
- మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే గౌతు శిరీష



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఉన్న ప్రతి మహిళకు ఒక అన్నలా అండగా నిలిచి వారి ఆర్థికాభివృద్ధికి సీఎం చంద్రబాబు బాటలు వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సొంత తల్లి, చెల్లిని రాజకీయంగా ఉపయోగించుకొని జగన్ రెడ్డి నిర్లక్ష్యం చేస్తే... రాష్ట్రంలో ఉన్న ప్రతి మహిళకు కొండంత భరోసా కల్పిస్తూ సాధికారతకు చంద్రన్న కృషి చేస్తున్నారని కొనియాడారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం విజయవంతంగా కొనసాగుతోంది. స్త్రీ శక్తి పథకానికి రాష్ట్ర మహిళలకు జేజేలు కొడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాలు 100 కోట్ల మార్కును దాటడం మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి మహిళలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూస్తే... చంద్రబాబు నేడు వారిని ప్రగతి చోదుకులుగా మారుస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు పథకం అమలుకు రూ.3,552.04 కోట్లు ఖర్చు చేసింది. ఒక్కో మహిళకు నెలకు సుమారు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు ప్రయాణ ఖర్చు ఆదా అవుతోంది. స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు లబ్ధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలపై గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఆయాలు, ఆశా వర్కర్ల సమస్యలను జగన్ పట్టించుకోలేదు.మహిళలకు సంక్షేమ పథకాలే కాకుండా వారిని వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ, సామాజిక గౌరవం, ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడమే స్త్రీ శక్తి పథకం ప్రధాన లక్ష్యమని ఒక ప్రకటనలో గౌతు శిరీష స్పష్టం చేశారు.

# గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్యసేవలు

- 6 నెలల్లో మరో 4,400 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల కొత్త భవన నిర్మాణాల పూర్తి
- ఈ ఏడాది చివరి నాటికి 2,700 కేంద్రాల నూతన భవనాలు సిద్ధం
- వైద్యసేవలు గ్రామాలకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్ఘాటన
- 24 జిల్లాల్లో 267 కొత్త కేంద్రాలు ఏకకాలంలో ప్రారంభం
- గుడివాడ డివిజన్ జనార్ధనపురంలో మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా జరిగిన రాష్ట్రస్థాయి ప్రారంభ కార్యక్రమం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో అరుదైన ఘట్టం ఆవిష్కరణ




గుడివాడ (చైతన్యరథం): గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ డివిజన్‌లోని జనార్ధనపురంలో నూతన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగానే రాష్ట్రంలోని 24 జిల్లాల్లో మరో 266 భవనాలను వర్చువల్‌గా ఏకకాలంలో ప్రారంభించారు. వీటి నిర్మాణానికి సుమారు రూ.105 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. 24 జిల్లాల్లోని 87 నియోజకవర్గాల పరిధిలో ఈ భవనాలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి చెప్పారు.

రాబోయే 6 నెలల్లో మిగిలిన 4,400 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందులో ఈ ఏడాది చివరి నాటికి 2,700 కేంద్రాల నూతన భవనాలను సిద్ధం చేసేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. తదుపరి ప్రారంభ కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. భవన నిర్మాణ పనులు పంచాయతీరాజ్ శాఖ ద్వారా కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామం నుంచి పట్టణానికి వెళ్లి వైద్యం పొందాల్సిన అవసరం లేకుండా వైద్య సేవలనే గ్రామానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ లో ఒకేసారి 267 నూతన ఆరోగ్య భవనాలను ప్రారంభించడం అరుదైన ఘట్టంగా పేర్కొన్నారు.

**నిలిచిన పనులు.. పెరిగిన భారం**

గత ప్రభుత్వ నిర్వాకంతో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలతోపాటు కొత్తగా చేపట్టిన నిర్మాణాలు కలిపి మొత్తం 4,400కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పూర్తి చేసే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం వివిధ పథకాల కింద రూ.1,128.02 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో వ్యయం కూడా పెరిగిందని తెలిపారు. గతంలో ఒక్కో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి సుమారు రూ.17.50 లక్షలు ఖర్చు కాగా, ప్రస్తుతం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఒక్కో కేంద్రానికి సుమారు రూ.36 లక్షల వరకు కేటాయిస్తున్నామని వివరించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకం కింద మరో సుమారు 700 కేంద్రాలను ఒక్కో కేంద్రానికి రూ.55 లక్షల చొప్పున అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

**ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలతో గ్రామానికే వైద్యం**

ప్రతి 5 వేల జనాభాకు ఒకటి చొప్పున ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి కేంద్రంలో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు, 71 రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బీపీ, మధుమేహం, మాతా శిశు ఆరోగ్యం, కంటి, నోటి ఆరోగ్యం, వృద్ధుల ఆరోగ్యం, అంటువ్యాధులను ముందుగానే గుర్తించేలా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైన వారికి ఉన్నత వైద్య సేవలకు పంపించడంతోపాటు, దూర వైద్య సేవల ద్వారా నిపుణుల సలహాలు అందించే విధానాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**'సంజీవని'తో ఆరోగ్య సమాచారం ఒకేచోట**

ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, భవిష్యత్తులో అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి 'సంజీవని' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి వ్యక్తికి ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు సంఖ్యను కేటాయించి, వైద్య పరీక్షలు, మందులు, వైద్యుల సలహాలు, ఆసుపత్రుల్లో పొందిన చికిత్స వివరాలను భద్రపరిచే విధానం తీసుకొస్తున్నామని చెప్పారు.

దాదాపు 2,500 మంది సమన్వయకర్తల ద్వారా సేవలను ప్రజలకు చేరువ చేస్తామని, దూర వైద్యం, వైద్యుల సలహాలు, ఆసుపత్రి అపాయింట్‌మెంట్ వంటి సేవలను కూడా అనుసంధానం చేస్తామని తెలిపారు. వచ్చే జనవరి 1 నుంచి ఈ సేవలను ప్రారంభించే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**930 మొబైల్ ఆరోగ్య కేంద్రాలు**

మారుమూల గ్రామాలకు వైద్య సేవలను తీసుకెళ్లేందుకు 930 మొబైల్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఒక్కో వాహనంలో 41 రకాల పరీక్షలు నిర్వహించే సదుపాయంతోపాటు, సుమారు రూ.10 లక్షల విలువైన ఆటో అనలైజర్ పరికరం ఉంటుందని చెప్పారు. ఈ వాహనాలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రామాలను సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. సాధారణంగా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చయ్యే కొన్ని పరీక్షలను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**వ్యాధి వచ్చిన తర్వాత కాదు.. ముందే గుర్తింపు**

వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే గుర్తించి నివారించడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను తొలిదశలో గుర్తించి చికిత్స అందిస్తే భవిష్యత్తులో మూత్రపిండాలు, గుండె వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని తెలిపారు.

**నాణ్యతా ప్రమాణాల్లో పురోగతి**

విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల గుర్తింపు కోసం చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. 2024-25లో 752, 2025-26లో 892 కేంద్రాలు గుర్తింపు పొందాయని చెప్పారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,644 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు ఈ గుర్తింపు లభించిందని వివరించారు.

**ప్రజల సహకారం అవసరం**

గ్రామస్థాయిలో ఆరోగ్య సేవలు అందించడంలో మధ్యస్థాయి ఆరోగ్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజలు వారి సేవలను గౌరవించాలని, ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామీణ ఆరోగ్య సేవలు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు.

**గుడివాడ నియోజకవర్గంలో 41 కేంద్రాలు**

గుడివాడ నియోజకవర్గంలో 41 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, మూడు బ్లాక్ ప్రజారోగ్య యూనిట్లు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వీటి ద్వారా నియోజకవర్గంలోని గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయని చెప్పారు. గ్రామానికే వైద్యం తీసుకెళ్లి, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేనప్పటికీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా స్త్రీ శక్తి బట్టి పథకాలను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో ఓపి సేవలు పెరిగాయని చెప్పారు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీర పాండ్యన్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

---

### చెన్నూరులో శ్రీ కోదండరామ భజన మందిర

# నిర్మాణానికి సహకారం అందిస్తాం

**ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడికి ఎంపీ బాలశౌరి హామీ**

పెడన(చైతన్యరథం): కృష్ణా జిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామంలో ప్రతిపాదిత శ్రీ కోదండరామ భజన మందిర నిర్మాణానికి, ప్రజా ఉపయోగ కర అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తానని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. మచిలీపట్నంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో 'తెలుగు టైమ్స్' (అమెరికా) ఎడిటర్ అండ్ సీఈవో, శ్రీ కోదండరామ ట్రస్ట్ (చెన్నూరు) అధ్యక్షుడు చెన్నూరి వెంకట సుబ్బారావు మంగళవారం ఎంపీ బాలశౌరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భజన మందిర నిర్మాణ ప్రతిపాదనలను ఎంపీకి వివరించి తగిన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. చెన్నూరు గ్రామంలో మూడో తరానికి చెందిన తాము గత 20 ఏళ్లుగా గ్రామస్తుల సహకారం తో శ్రీ కోదండరామ గుడి నిర్వహణ బాధ్యతలను చూస్తున్నామని తెలిపారు. ఇప్పుడు గ్రామ ప్రజల కోరిక మేరకు భక్తజనుల కోసం ఒక భజన మంది రాన్ని కూడా నిర్మించాలని తలపెట్టినట్లు చెప్పారు. ఇందుకు సహకారం అందించాలని కోరగా అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారు. ప్రజా ప్రయోజనార్థం చేపట్టే ఈ నిర్మాణానికి తన వంతు



సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ భజనమందిర నిర్మాణానికి దాతలు, శ్రేయో భిలాషులు ఉదారంగా విరాళాలు అందించి నిర్మాణానికి తోడ్పడాలని సుబ్బా రావు ఒక ప్రకటనలో కోరారు. విరాళాలు, ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్ (91) 98495 99625, ఈమెయిల్ subbarow.chennuri@gmail.comతో సంప్రదించవచ్చని చెప్పారు.



**పెడన ఎమ్మెల్యేకు వినతి**

పెడన ఎమ్మెల్యే కవిత కృష్ణప్రసాద్‌ను 'తెలుగు టైమ్స్' (అమెరికా) ఎడిటర్ అండ్ సీఈవో, శ్రీ కోదండరామ ట్రస్ట్ (చెన్నూరు) అధ్యక్షుడు చెన్నూరి వెంకట సుబ్బారావు కలిశారు. చెన్నూరులో శ్రీ కోదండరామ భజన మందిర నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు.

# నౌకానిర్మాణ రంగంలో కొత్త శకం

**భారత నౌకాదళ తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్‌కు 'సూర్య'గా నామకరణం, విశాఖలో జలప్రవేశం - రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**




విశాఖపట్నం (చైతన్యరథం): భారత స్వదేశీ నౌకానిర్మాణ రంగంలో మరో కీలక అధ్యాయానికి విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) వేదికైంది. భారత నౌకాదళం కోసం నిర్మిస్తున్న తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్–1)కు 'సూర్య'గా నామకరణం చేయడంతో పాటు జలప్రవేశ కార్యక్రమాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం విశాఖలో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నౌకాదళ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**'సూర్య'గా తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్**

హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో నిర్మిస్తున్న తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్‌కు 'సూర్య'గా నామకరణం చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. భారత నౌకాదళ అవసరాలకు అనుగుణంగా చేపట్టిన ఈ నౌకా నిర్మాణ కార్యక్రమాన్ని స్వదేశీ నౌకానిర్మాణ సామర్థ్యాల విస్తరణలో కీలక ముందడుగుగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అభివర్ణించారు.

ఇదే కార్యక్రమంలో ఐదో ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్–5) నిర్మాణానికి కీల్ లేయింగ్ నిర్వహించారు. తద్వారా ఫ్లీట్ సపోర్ట్ షిప్‌ల నిర్మాణ కార్యక్రమంలో మరో కీలక దశ ప్రారంభమైంది.

**స్లిప్‌వే-4.. 300 టన్నుల గోలియత్ క్రేన్**

హెచ్‌ఎస్‌ఎల్‌లో ఆధునీకరించిన స్లిప్‌వే–4తో పాటు 300 టన్నుల సామర్థ్యం కలిగిన గోలియత్ క్రేన్‌ను ప్రారంభించారు. ఈ ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో మరింత భారీ నౌకల నిర్మాణ సామర్థ్యం హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కొత్త స్లిప్‌వే, భారీ గోలియత్ క్రేన్ వంటి ఆధునిక మౌలిక సదుపాయాలు నూరా ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచి, భవిష్యత్తులో భారీ నౌకా నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టేందుకు దోహదపడతాయని తెలిపారు.

**విశాఖకు మరింత పారిశ్రామిక బలం**

ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు, మౌలిక సదుపాయాలు పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సమన్వయంతో కూడిన మౌలిక సదుపాయాల అభివృద్ధితో విశాఖను ప్రధాన నౌకాయాన, నౌకానిర్మాణ, పారిశ్రామిక కేంద్రంగా మరింత బలోపేతం చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన హిందుస్థాన్ షిప్‌యార్డ్ భారత నౌకానిర్మాణ రంగానికి విశేష సేవలు అందించిందని పేర్కొన్నారు. హెచ్‌ఎస్‌ఎల్ సామర్థ్యం పెరగడం వల్ల ఇంజనీరింగ్, స్టీల్, లాజిస్టిక్స్ వంటి అనుబంధ పరిశ్రమలకు అవకాశాలు విస్తరించడంతో పాటు మీవీజులు, స్థానిక పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యాలను పెంపొందించడం, దేశీయ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.

**రాజ్‌నాథ్ సింగ్‌కు ఆత్మీయ సత్కారం**

కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు.

కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్ రాజు, చీఫ్ ఆఫ్ ది నావల్ స్టాఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, రక్షణ ఉత్పత్తుల శాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్, హెచ్‌ఎస్‌ఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖరన్ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.






# తిరువూరు టీడీపీ వివాదంపై పల్లా ఆరా!

**- నేతలను పిలిపించి వివరణ తీసుకున్న రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు**
**- టోల్‌ప్లాజా ఘటనపై చింతమనేని ప్రభాకర్ నుండి వివరణ తీసుకున్న పల్లా**

అమరావతి (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో టీడీపీ నేతల మధ్య వివాదం, దెందులూరులో టోల్ ప్లాజా ఘటనలపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళవారం విచారణ జరిపారు. ముందుగా తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య మధ్య నెలకొన్న వివాదంపై మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇరువురితో విడివిడిగా పల్లా శ్రీనివాసరావు సమావేశమయ్యారు. పరస్పరం చేసుకున్న ఆరోపణలు, పార్టీ అధిష్ఠానానికి అందిన ఫిర్యాదులపై ఇరువురి నుంచి వివరాలు, వివరణ కోరారు. పార్టీ అంతర్గత వ్యవహారాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

అదేవిధంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై టోల్‌ప్లాజా ఘటనకు సంబంధించి వచ్చిన ఆరోపణలపైనా పల్లా ఆరా తీశారు. టోల్‌ప్లాజా సిబ్బంది, లారీ డ్రైవర్లు ఇచ్చిన వివరణలను పరిగణనలోకి తీసుకుని ఘటనకు సంబంధించిన వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. టోల్‌ప్లాజా ఘటనతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సంబంధం లేదని సంబంధిత డ్రైవర్లు, సిబ్బంది స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ అంశంపై పూర్తి వివరాలను పల్లా తెలుసుకున్నారు. వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలకు దూరంగా ఉంటూ పార్టీ క్రమశిక్షణ, ఐక్యతను కాపాడాలని నేతలకు పల్లా సూచించారు.







చైతన్యరథం

# వారణాసి చేరుకున్న 'సేవా సంకల్ప్ యాత్ర'

**- స్వాగతం పలికిన ఎంపీలు చింతకాయల విజయ్, సానా సతీష్**

వారణాసి (చైతన్యరథం): ముఖ్యమంత్రిగా, ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా 25 సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుంచి తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్), తెలుగు యువత ఆధ్వర్యంలో చేపట్టిన సేవా సంకల్ప్ బైక్ యాత్ర మంగళవారం రాత్రి ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి చేరుకుంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో చేపట్టిన 'సేవా సంకల్ప బైక్ యాత్ర' ఐదు రాష్ట్రాల మీదుగా దాదాపు 2,000 కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేసుకుని వారణాసికి చేరుకుంది. సెప్టెంబర్ 30న తిరుపతిలో ప్రారంభమైన ఈ ఏడు రోజుల యాత్ర, యువత భాగస్వామ్యం, ఆధ్యాత్మికత, సేవాభావం, జాతీయ సమైక్యత సందేశాన్ని మేళవించిన ఒక విశిష్ట ప్రయాణంగా 25 మంది యువ బైకర్లను ఏకం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితం, దేశ సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన విస్తృతమైన 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా ఈ యాత్ర నిర్వహించారు.

కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుని ఆశీస్సులతో తిరుమల శ్రీవారి



పాదాల వద్ద ఈ యాత్ర ప్రారంభమైంది. తిరుపతి నుండి బయలుదేరిన యాత్రికులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రయాణించారు. ఈ యాత్రలో ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, ప్రయాణ సమయంలో ప్రముఖ నదుల నుండి సేకరించిన పవిత్ర జలాలతో కూడిన 'జల కలశాన్ని' తీసుకువెళ్లడం. బైక్ రైడర్లు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వైపు వెళ్లడానికి ముందు శ్రీకాళహస్తి ఆలయం, విజయవాడలోని కనకదుర్గ ఆలయం, భద్రాచలంలోని శ్రీరామ ఆలయం, మహారాష్ట్రలోని చంపా ఆశ్రమ శాంతి ధామ్ ఆలయంతో సహా అనేక ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రాలను కూడా సందర్శించారు. ఈ యాత్రలో నాగ్‌పూర్‌లో ఒక ముఖ్యమైన ఘట్టం చోటుచేసుకుంది. అక్కడ యాత్రలో పాల్గొన్న శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్‌లు.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి, వారికి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదాన్ని అందజేశారు. వారణాసి చేరుకున్న యాత్రికులకు రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, సానా సతీష్ బాబు ఘన స్వాగతం పలికారు. ఈ స్వాగత కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖల సహాయ మంత్రి రవీంద్ర జైస్వాల్ కూడా పాల్గొన్నారు. ఆయన యాత్రికులకు స్వాగతం పలకడమే కాకుండా, ఈ యాత్ర వెనుక ఉన్న స్ఫూర్తిని అభినందించారు. కాశీ విశ్వనాథుని సన్నిధిలో గంగా హారతి, ప్రార్థనలు, జలాభిషేకంలో పాల్గొనడంతో ఈ యాత్ర ముగిసింది.

# నెల్లూరు వీఆర్‌సీ గ్రౌండ్‌కు కొత్త కళ



డాక్టర్ పోకల రవికి ప్రశంసాపత్రం

- **క్రీడలు, ఆరోగ్యానికి పెద్దపీట**
- **ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్**
- **ప్రభుత్వ పాఠశాలల్లోనూ క్రీడా సదుపాయాల కల్పన**
- **వీఆర్ హైస్కూల్ రాష్ట్రానికే ఆదర్శం: మంత్రి నారాయణ**

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు నగర నడిబొడ్డున ఉన్న వీఆర్‌సీ గ్రౌండ్‌కు కొత్త హంగులు అద్దేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శ్రీకారం చుట్టారు. విద్యార్థులు, వాకర్స్, క్రీడాకారులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్ల నిర్మాణ పనులకు తన కుమార్తె షరణితో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టును కూడా ఆధునీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువులతో పాటు విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఇండోర్, అవుట్‌డోర్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్థలం అందుబాటులో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలోనూ స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**18 పాఠశాలలకు ఆధునిక హంగులు**

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 18 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, ఈ పాఠశాలకు స్వచ్ఛ



అవార్డు కూడా లభించిందని చెప్పారు. అదే స్ఫూర్తితో డీఎస్సార్, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రారంభించామని తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి తన స్నేహితులు, పూర్వ విద్యార్థులు, ఉన్నత స్థాయిలో ఉన్న తన పరిచయస్తుల సహకారాన్ని తీసుకుంటానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల అభివృద్ధిని అభినందిస్తుంటే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వారి అవాకులు, చవాకులను నేను పట్టించుకోనన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్య, క్రీడా సదుపాయాలు అందించడమే మా లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం 14వ డివిజన్‌లోని ఎంఎస్ఎం హైస్కూల్, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను మంత్రి పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, క్రీడా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

వీఆర్‌సీ గ్రౌండ్‌లో జెండా పోల్ ఏర్పాటుకు రూ.20 వేల విరాళం అందించిన డాక్టర్ పోకల రవిని మంత్రి నారాయణ అభినందించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ పంపిన ప్రశంసాపత్రాన్ని ఆయనకు అందజేశారు. వీఆర్‌సీ గ్రౌండ్‌లో మెరుగైన సదుపాయాల కోసం తమ కోరికను నెరవేరుస్తున్న మంత్రి నారాయణకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తరువాత కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. కేక్ కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హిమబిందు, ఎస్ఈ జానీ, డీఈవో బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ పోకల రవి, సుజన్, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఏడుకొండలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్బారెడ్డి, బాబు, నన్నే సాహెబ్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు విస్తారంగా కురవాలి

**వరుణ యాగంలో మంత్రి నారాయణ - అన్ని నియోజకవర్గాల్లో యాగాలు నిర్వహిస్తామని వెల్లడి**



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి జలాశయాలు నిండాలని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆకాంక్షించారు. నెల్లూరు సిటీ మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన వరుణ యాగంలో మంత్రి నారాయణ తన కుమార్తె షరణితో కలిసి పాల్గొన్నారు. యాగంలో పూర్ణాహుతి సమర్పించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సాధారణంతో పోలిస్తే వర్షపాతం 54 శాతం తక్కువగా నమోదైందని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఉత్తరాంధ్రలో పరిస్థితి కొంత మెరుగుపడిందని తెలిపారు. అయితే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలు కురవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసుకునేందుకు అవసరమైన నీరు అందుబాటులోకి రావాలని, ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలని ప్రార్థించానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జనార్దన్, ఈవో జానకి, ఆలయ చైర్మన్ వేలూరు పెంచలరాజు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, డివిజన్ టీడీపీ నేతలు గండవరం నాని, అన్నంగి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- **తిరుపతి జిల్లా టీడీపీ స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి డా. నూకసాని బాలాజీ పిలుపు**
- **సత్యవేడు నియోజకవర్గ పార్టీ నేతలు, శ్రేణులతో సమీక్ష**

సత్యవేడు (చైతన్యరథం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని సత్యవేడు నియోజకవర్గ నాయకులకు ఏపీ టీడీపీ చైర్మన్, తిరుపతి జిల్లా టీడీపీ ఎన్నికల ఇన్‌చార్జి డా. నూకసాని బాలాజీ పిలుపు ఇచ్చారు. సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి కూరపాటి శంకరరెడ్డి, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో డా. నూకసాని బాలాజీ మంగళవారం సమావేశమై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులకు డా. నూకసాని బాలాజీ సూచించారు. ప్రతి మండలంలో పార్టీ పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించి, బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించేలా కార్యాచరణ



రూపొందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, అంతర్గత విభేదాలు ఏమైనా ఉంటే వాటిని పక్కన పెట్టి పార్టీ ప్రయోజనాల కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొని, ఏడు మండలాల్లో పార్టీ మరియు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ ఆదేశాలు, పార్టీ అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తామని నాయకులు స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో సత్యవేడు నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్యరథం

# 21వ శతాబ్దపు వికసిత భారత వైతాళికుడు మోదీ

## నేటితో ముఖ్యమంత్రి, ప్రధానిగా 25 ఏళ్ల ప్రస్థానం పూర్తి




గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న నరేంద్ర దామోదర్ దాస్ మోదీ 21వ శతాబ్దంలో తన మాటలు, పనులు, ఫలితాలతో దేశ ప్రజల్లో నూతన చైతన్యాన్ని పురికొల్పిన వైతాళికుడు. 21వ శతాబ్దపు ప్రారంభంలో అక్టోబరు 7, 2001న గుజరాత్ రాష్ట్ర అతి పిన్న వయస్కుడైన ముఖ్యమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టారు. ఆ పదవిలో 13 ఏళ్లు కొనసాగి మే 26, 2014న ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం (అక్టోబరు 7) నాటికి నిరాటంకంగా నరేంద్ర మోదీ 25 ఏళ్లు ఆ రెండు పదవుల్లో పూర్తి చేసుకున్నారు. 80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 25 ఏళ్ల పాటు అత్యున్నత పదవీ బాధ్యతలు చేపట్టి దేశ చరిత్రలో నరేంద్ర మోదీ ఒక నూతన అధ్యాయాన్ని రచించారు.

### చైతన్య స్ఫూర్తి ప్రదాత మోదీ

దేశ వ్యాప్తంగా సమస్యాత్మక పరిస్థితులు నెలకొన్న తరుణంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా రాజకీయ యవనికపై ప్రవేశించిన మోదీ గత 25 ఏళ్లుగా తనదైన ముద్ర వేశారు. 1984 నుంచి 30 ఏళ్ల పాటు కేంద్రంలో కొనసాగిన సంకీర్ణ ప్రభుత్వాల అనిశ్చిత యుగానికి తెరదించుతూ 2014 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని స్పష్టమైన మెజారిటీతో తొలిసారిగా ప్రభుత్వ ఏర్పాటు దిశగా నడిపించిన ఘనత సాధించారు. తదుపరి మరో రెండు ఎన్నికల్లో విజయ పరంపర కొనసాగించా రు. ఈ విజయాలకు ముందు మోదీ గుజరాత్లో మూడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని విజయతీరాల వైపు నడిపించారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వాల నిర్వాకాల వలన దేశ ప్రజల్లో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. ప్రజల ఆశలు ఆవిరైపోతూ భవిష్యత్తు పట్ల విశ్వాసం కోల్పోయిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తరుణంలో గుజరాత్‌లో మోదీ సాధించిన ఫలితా ల ఆధారంగా దేశ ప్రజలు ఆయనకు ప్రధానిగా పట్టంకట్టారు. ఈ విజయం ఆధునిక భారత చరిత్రలో అద్వితీయమైనది. గుజరాత్‌లో తన పాలనతో తెచ్చిన మార్పు ఆధారంగా 2014లో దేశ ప్రజలకు నరేంద్ర మోదీ బలమైన ఆశాజ్యోతిగా కన్పించారు. గత 12 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొన్నారు. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పు డు ప్రజల్లో నూతన చైతన్యాన్ని నింపి, భవిష్యత్తు పట్ల బలమైన విశ్వాసాన్ని కల్పించి వికసిత భారత స్ఫూర్తి ప్రదాతగా మోదీ దేశ ప్రజల మనసుల్లో సుస్థిరస్థానాన్ని పొందారు.

### దేశ ప్రగతిలో ప్రధానిగా మోదీ కృషి

ప్రజల ఆశలు, ఆకాంక్షలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ పలు వినూత్న ఆలోచనలు, పట్టుదలతో పలు రంగాల్లో సత్ఫలితాలను సాధించారు. అప్పటివరకు అతి తక్కువ స్థాయిలో ఉన్న ఎయిమ్స్, ఐఐఎం, ఐఐటీ, ఎన్ఐటీలను దేశవ్యాప్తంగా దజన్ల కొలది మోదీ ప్రభుత్వం విస్తరించింది. వందలాది నూతన వైద్య కళాశాలలు ఏర్పడ్డాయి. గ్రామస్థాయిలో లక్షలాది ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు ఆవిర్భవించాయి. ఇవి ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే 10,032 ఏర్పడ్డాయి.

శుభ్రత పట్ల జాతిపిత సందేశంతో స్వచ్ఛ భారత అభియాన్‌ను జాతీయ ఉద్యమంగా రూపొందించి 12 కోట్లకు పైగా మరుగు దొడ్ల ఏర్పాటుకు ప్రధాని మోదీ కారకులయ్యారు. పేదలకు 4 కోట్లకు పైగా సొంత గృహాల నిర్మాణం, 10కోట్లకు పైగా మహిళలకు వంట గ్యాస్ కనెక్షన్లు, 57కోట్ల మంది మహిళలకు బ్యాంక్ అకౌంట్లు, 80 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత ఏర్పాటు ప్రధాని మోదీ ఆలోచనలకు, అమలుకు తార్కాణాలు. కొవిడ్-19 మహమ్మారిని సమర్థవంతంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎదుర్కొన్న తీరు దేశ విదేశాల్లో ప్రశంసలు పొందింది.

మౌలికవసతుల అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ పెద్దపీట వేసి దేశంలో ఆర్థికాభివృద్ధిని శీఘ్రతరం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా 'నినాదంతో పారిశ్రామిక ప్రగతికి బలమైన పునాదులు వేయడంతో పాటు, సాంకేతిక వినియోగంతో యూపీఐ చెల్లింపు ల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉండేలా చేయడం విశేషం. ఉద్యోగావకాశాలను కల్పించే స్టార్టప్ రంగంలో కూడా దేశం ముందంజలో ఉంది. సంక్షేమం, ఆర్థికాభివృద్ధి పట్ల సమతు లనంపై విశ్వాసం ఉంచే ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరిక రేఖను అధిగమించారు. జాతీయ భావాలను, విలువలను పుణికిపుచ్చుకున్న మోదీ నినాదం...సబ్ కా సాత్-సబ్ కా వికాస్-సబ్ కా విశ్వాస్ (అందరికీ అండగా-అందరి శ్రేయస్సు-అందరి విశ్వాసం).

### రక్షణ-విదేశీ వ్యవహారాల్లో కొత్త పుంతలు

ప్రధాని మోదీ పాలనలో అంతరిక్షం, దేశ రక్షణ, విదేశీ వ్యవహారాల్లో దేశం నూతన పుంతలు తొక్కింది. చంద్రయాన్-3 విజయంలో భాగంగా చంద్ర గ్రహం దక్షిణ ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ మరియు ప్రజ్ఞాన్ రోవర్ దిగటంతో ప్రపంచంలో ఈ ఘనత సాధించిన నాలుగవ దేశంగా భారత్ ప్రసిద్ధికెక్కింది. త్వరలో చంద్రుడిపైకి మనుషులను పంపే గగన్‌యాన్ మిషన్‌ను ప్రయోగించనున్నారు. మంగళ గ్రహ కక్ష్యలోకి రాకెట్‌ను ప్రయో గించడం భారత్ సాధించిన మరో విజయం. ఈ విజయాల నేపథ్యంలో పలు అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ ఉపగ్రహా లను అంతరిక్షంలోకి పంపేందుకు మన దేశంపై ఆధారపడు తున్నాయి. అంతర్గత నక్సల్ తీవ్రవాదాన్ని లక్ష్యం మేరకు నిర్మూ లించడంతోపాటు సరిహద్దుల భద్రత విషయంలో దేశం తన సత్తాను చాటింది. పాక్ దుశ్చర్యలకు సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్ ద్వారా కోలుకోలేని జవాబిచ్చింది.

దేశ విదేశీ విధానాన్ని జాతీయ ప్రయోజనాలతో అనుసంధానం చేస్తూ మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దేశానికి ఎంతో మేలు చేస్తోంది. దశాబ్దాల పాటు దేశ ప్రధానులు పర్యటించని పలు దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించి సత్సంబంధాలు నెలకొల్పుతున్నారు. పలు ప్రధాన దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేస్తున్నారు. ఉక్రెయిన్-రష్యా, పశ్చిమాశియా యుద్ధాలకు సం బంధించి దేశ వైఖరి ప్రశంసలందుకుంటోంది. నిరంతరం పెరుగుతున్న దేశ ఆర్థిక సామర్థ్యంతో పాటు పలు ఇతర రంగాల్లో దేశం సాధిస్తున్న ప్రగతి దృష్ట్యా పలు వికసిత దేశాల నాయకులు ప్రధాని మోదీతో సమావేశాలకు, చర్చలకు నిరంతర ఆశక్తి చూపు తున్నారు. గతానికి భిన్నంగా ప్రధాని నరేంద్ర మోదీ పలు అంతర్జాతీయ నాయకులతో సూటిగా, స్పష్టంగా, దీటుగా వ్యవ హరిస్తూ దేశ ప్రతిష్టను ఇనుమడింపచేస్తున్నారు. అంతర్జాతీయ యవనికపై మన త్రివర్ణ పతాకం మున్నెన్నడూ లేని విధంగా రెపరెపలాడుతోంది.

### నిర్ణయాత్మక నాయకత్వం

దేశ సమస్యల పరిష్కారానికి నిర్ణయాత్మక నాయకత్వం అవసరమని ప్రధాని మోదీ అభిలషిస్తారు. అవసరమైనప్పుడు దృఢంగా వ్యవహరించడంలో ఆయన వెనుకాడరు. దేశ ప్రయోజ నాల దృష్ట్యా జీఎస్టీ సంస్కరణల విషయంలో ప్రధాని మోదీ నిశ్చలంగా వ్యవహరించడంతో దేశం ఎంతో లాభించింది. దేశం లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం అంతర్భాగం అయ్యే విషయంలో రాజ్యాంగంలోని 370 అధికరణ దశాబ్దాలుగా అవరోధంగా మారింది. ఈ దీర్ఘకాలిక సందిగ్ధతను పూర్తిగా నిర్మూలించేందుకు నడుంకట్టి 370 అధికరణ రద్దుకు చర్యలు తీసుకున్నారు. ప్రధాని మోదీ దృఢంగా వ్యవహరించకుంటే ఈ సమస్య కొనసాగుతూనే ఉండేది.

### వైబ్రెంట్ గుజరాత్-వైబ్రెంట్ ఇండియా

13 ఏళ్ల కృషితో నరేంద్ర మోదీ 'వైబ్రెంట్ గుజరాత్'ను రూపొందించారు. ఆ ఫలితాలను వీక్షించిన దేశ ప్రజలు అవి తమకు కూడా దక్కాలని అభిలషించారు. ఆయనను 2014లో ప్రధానిగా ఎన్నుకున్నారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా గత 12 ఏళ్లుగా అకుంఠిత దీక్షతో శ్రమిస్తున్నారు. 'వైబ్రెంట్ ఇండియా' రూపొందుతోంది. 2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలన్నది ప్రధాని మోదీ సంకల్పం. ఆయన రగిలించిన చైతన్యంతో దేశ ప్రజలు సమిష్టిగా ఉద్యమిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో... 2014కు మందు దేశ ప్రజల్లో నెలకొన్న నిరాశ, నిస్పృహలకు భిన్నంగా భారతావని నేడు నూతన చైతన్యంతో, సత్తువతో, ఆత్మ విశ్వాసంతో, భవిత పట్ల పూర్తి నమ్మకంతో ప్రధాని మోదీ నాయకత్వం పట్ల పూర్తి భరోసాతో వికసిత భారతం నినాదంతో ముందుకు సాగుతోంది. నిస్సం దేహంగా ప్రధాని నరేంద్ర మోదీ 21వ శతాబ్దపు వికసిత భారత వైతాళికుడే!



**- సత్యకుమార్ యాదవ్,**
**బీజేపీ జాతీయ కార్యదర్శి,**
**వైద్యారోగ్య మంత్రి, ఆంధ్రప్రదేశ్.**

### మోదీ ప్రత్యేకతలు

*ఆరేళ్ల వయసు నుంచి నరేంద్రమోదీకి ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలతో అనుబంధం ఉంది. దీర్ఘకాలం పాటు సంఘ్ కార్యకర్తగా నిబద్ధతతో పనిచేసి అనంతరం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ ప్రయాణంలో దేశ నాగరికత, సంప్రదాయాలు, విలువల పట్ల సమగ్రమైన అవగాహనను పెంపొందించుకున్నారు. భారతీయులంతా ఒకే తాటిపై నడవాలని ఆయన ఆశయం. 'ప్రతి పౌరుడు గర్వంగా నేను భారతీయుడిని' అని చెప్పు కోవాలని ఆయన ఆశిస్తారు. ఆయన ఆలోచనలు, పనులు ఈ ప్రాతిపదికన ఉంటాయి. కుల,మత,ప్రాంతీయ వ్యత్యాసాలకు అతీతంగా ప్రజలు, ప్రభుత్వాలు వ్యవహరించాలని మోదీ ప్రగాఢ వాంఛ. పౌరులందరికీ ఒకే న్యాయం, ఒకే చట్టం వర్తించాలని ఆశిస్తారు. దీనికి అనుగుణంగా శతాబ్దాల పాటు ముస్లిం మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టడానికి ట్రిపుల్ తలాక్‌ను రద్దుచేసేలా చర్యలు చేపట్టారు. ఏనాటికైనా దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి రావాలని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల చిరకాల వాంఛ.*

# నర్సీపట్నంలో వైభవంగా 'వరుణయాగం... పాల్గొన్న సభాపతి

**●రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి లేకుండా భూగర్భ జలాల పెంపే లక్ష్యం : స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**



నర్సీపట్నం (చైతన్యరథం): నర్సీపట్నంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరి ఆలయంలో మంగళవారం 'వరుణయాగం' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, వారి సతీమణి చింతకాయల పద్మావతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు సమర్పించారు. వీరితోపాటు వారి తనయుడు, టిడిపి నర్సీపట్నం పట్టణ అధ్యక్షుడు చింతకాయల రాజేష్ కూడా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ... రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో తాగునీటి కరువు రాకుండా భూగర్భ జలమట్టాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వర్షయాగాలను చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది ఏలినో ప్రభావం వలన ఆరంభంలో వర్షాలు ఆలస్యమవ్వడం వల్ల రైతులు కొంత ఇబ్బంది పడ్డారని, 70 శాతం నాట్లు పూర్తికాగా, మిగిలిన 30 శాతానికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. తుఫానుల వల్ల పడిన వర్షాలతో కరువు గండం నుంచి బయటపడినప్పటికీ, శాస్త్రవేత్తల సూచనల మేరకు భూగర్భంలో నీటి నిల్వలను పెంచుకోవడం ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాల కాలం నాటి కల అయిన పోలవరం/గోదావరి జలాలు అనకాపల్లి వరకు చేరుకోవడం శుభపరిణామమని, వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించి శ్రీకాకుళం వరకు ఈ నీటిని తీసుకెళ్లేందుకు ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. అలాగే నర్సీపట్నం ప్రాంతంలో భూగర్భ జలాలు స్థిరంగా ఉండేందుకు, తాగునీటి సమస్య తీర్చేందుకు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా రవణా పల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించే పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ యాగం ద్వారా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ, కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన వేద పండితులకు, దేవాదాయ శాఖ అధికారులకు, ఆలయ కమిటీ సభ్యులకు, టిడిపి నాయకులకు మరియు భక్తులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అనంతలో భక్తిశ్రద్ధలతో వరుణ యాగం--వరుణ జపం

**●పాల్గొన్న ఎమ్మెల్సీ రమాదేవి, టీడీపీ నాయకులు**

**●వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో కార్యక్రమం**



అనంతపురం (చైతన్యరథం): అనంతపురం నగరంలోని మొదటి రోడ్డులోని శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో వరుణ యాగం – వరుణ జపం, సహస్ర ఘటాభిషేకం కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు ఎమ్మెల్సీ రమాదేవి, ఆలయ కమిటీ చైర్మన్ అమిలినేని నరేంద్ర చౌదరి టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో యాగానికి సంబంధించిన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు ప్రజలు, రైతాంగం బాగుండాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్ఛారణల మధ్య ఈ లోకకల్యాణ యాగాన్ని నిర్వహించారు. అత్యంత వైభవంగా జరిగిన యాగం, వేద మంత్రాలతో ఆలయ ప్రాంతం మొత్తం ఒక ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నేతలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రమాదేవి, టీడీపీ నేతలు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వరుణ దేవుని కృపతో జిల్లా వ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా సంవృద్ధిగా వర్షాలు కురిసి కరవు కాటకాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఓ. నాగేంద్రుడు, టిడిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గాజువాకలో రూ.20 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో స్పోర్ట్స్ కాంప్లెక్స్

**●యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలి: ఎంపీ శ్రీభరత్**



విశాఖపట్నం (చైతన్యరథం): గాజువాక నియోజకవర్గంలోని 87వ వార్డు వడ్లపూడి మైదానంలో ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.20 లక్షలతో అభివృద్ధి చేసిన నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ కలిసి ప్రారంభించారు. ఈ కాంప్లెక్స్‌లో రెండు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఒక వాలీబాల్ కోర్టు, ఒక ప్రో కబడ్డీ కోర్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, నగరంలో 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న క్రీడా మైదానం లభించడం అరుదైన విషయమని అన్నారు. గాజువాకలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు మెరుగైన క్రీడా వసతులు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మైదానానికి చుట్టుపక్కల ఒక కిలోమీటరు పరిధిలో సుమారు 40 వేల మంది ప్రజలు నివసిస్తున్నందున, ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. క్రీడా మైదానంలో మౌలిక వసతులను దశలవారీగా మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని శ్రీభరత్ అన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, మైదానాన్ని సరైన గ్రేడింగ్‌తో అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి ఇండోర్ స్టేడియం వంటి అదనపు క్రీడా మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఎంపీ లాడ్స్ నిధులను ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ వినియోగిస్తున్నామని ఎంపీ శ్రీభరత్ వెల్లడించారు. విద్య, వైద్యం, క్రీడలు, గ్రంథాలయాల అభివృద్ధి వంటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగానే వడ్లపూడి మైదానంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో పిల్లలు, యువత ఎక్కువ సమయం సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితమవుతూ శారీరక శ్రమకు దూరమవుతున్నారని శ్రీభరత్ ఆందోళన వ్యక్తం చేశారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు.

**గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ...** తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకుని పిల్లలు, యువత మైదానాలకు వచ్చి క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. గాజువాకలో 8 చోట్ల క్రీడా మైదానాలు వున్నాయని వాటిని క్రమపద్ధతిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకుని యువత తమ ప్రతిభను వెలికితీసుకోవాలని ఎంపీ శ్రీభరత్ ఆకాంక్షించారు.

# టిక్కబాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కురుపాం ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**●విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఎమ్మెల్యే ఆరా :ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి**



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం నాడు ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులు చదువుతున్న తీరును, పాఠ్యాంశాలపై వారి అవగాహనను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, పాఠశాలలోని సౌకర్యాలపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో

# సింహాద్రిపురంలో బసవతారకం క్యాన్సర్ మెడికల్ క్యాంప్



సింహాద్రిపురం (చైతన్యరథం): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న బసవతారకం క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు మెడికల్ క్యాంప్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్సీ పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీటెక్ రవితో పాటు వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మారెడ్డి భరత్‌రెడ్డి, సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పుప్పాల శ్రీధర్ రెడ్డి క్యాంప్‌ను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందితో బీటెక్ రవి మాట్లాడి క్యాంప్‌లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, ప్రజలకు అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. క్యాంప్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను కూడా అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక క్యాంప్‌ను సింహాద్రిపురం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీటెక్ రవి కోరారు.

# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వరుణయాగం

**● ప్రత్యేక పూజలు నిర్వహించిన టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**



నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించినట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాగంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, వరుణ హోమ కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించడం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజల సంక్షేమం, రాష్ట్ర సుభిక్షం కోసం వరుణ యాగం నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని కూటమి నాయకులందరం కలిసి ప్రార్థించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ దోడ్డపనేని రాజా నాయుడు,కో క్లస్టర్ ఇంచార్జ్ మమతా రెడ్డి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఏలూరు శిరీష, 28వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చెక్క సాయి సునీల్, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు గజరా నరేష్, రాఘవేంద్ర, దొరబాబు, పెంచలయ్య, చంటి, నాగమణి, రాధా కుమారి, తేజ, నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు తోట శోభారాణి టిడిపి నాయకులు రఘురామ్, మునిశేఖర్ నాయుడు, దామోదర్, మేఘనాథ్ సింగ్, ఆకుల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా వరుణ యాగం

**●సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు.. పాల్గొన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు**



తిరువూరు (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గం, గంపలగూడెం మండలం నెమలి గ్రామంలోని వేణుగోపాలస్వామి వారి ఆలయంలో వరుణ యాగాన్ని శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులకు సాగునీరు పుష్కలంగా లభించి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని శ్రీ వేణుగోపాలస్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితులు, అర్చకులతో కలిసి ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, రైతుల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. వేద పండితులు, అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య హోమగుండంలో శాస్త్రోక్తంగా ఆహుతులు సమర్పించారు. చెరువులు, కాలువలు, జలాశయాలు నీటితో నిండి జలవనరులు సమృద్ధిగా ఉండాలని, ప్రకృతి అనుకూలించి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని ప్రత్యేక సంకల్పం చేశారు. ప్రాచీన కాలం నుంచి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ నిర్వహించే వరుణ యాగాలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నేలా సంధ్య, వేద పండితులు, ఆలయ అర్చకులు, భక్తులు, రైతులు, కూటమి పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దేచుపాలెంలో రూ.31 లక్షలతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనం ప్రారంభం



వత్సవాయి (చైతన్యరథం): నియోజకవర్గంలోని వత్సవాయి మండలం దేచుపాలెం గ్రామంలో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ - వెల్‌నెస్ హెల్త్ క్లినిక్ నూతన భవనాన్ని శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. రూ.31 లక్షల అంచనా వ్యయంతో MGNREGS, NHM నిధులతో నిర్మించిన ఈ భవనం ద్వారా దేచుపాలెం గ్రామ ప్రజలకు మరింత అందుబాటులో, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన వైద్య మౌలిక వసతులను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా ప్రజలకు ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య అవగాహనతో పాటు అవసరమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

## రాష్ట్రమంతా వరుణ భగవానుని అనుగ్రహంతో వర్షాలు కురిసి సుభిక్షంగా మారాలి : ఎమ్మెల్యే బండారు



కొత్తపేట (చైతన్యరథం): మందపల్లి గ్రామంలో నవగ్రహాల్లో అత్యంత శక్తివంతమైన శనైశ్చరస్వామి ప్రతిష్టించిన పవిత్రమైన మందేశ్వర స్వామి వారి సన్నిధిలో వరుణ యాగం, సహస్ర ఘటాభిషేకం నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వరుణయాగంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో దేశమంతా తీవ్రమైన కరువు ఏర్పడిన ప్రస్తుత తరుణంలో అష్టదిక్పాలకుల్లో పశ్చిమ దిక్కుకు అధిపతి అయిన వరుణుడి కరుణ కోరుతూ, వర్షాలు కురవాలని కోరుకుంటూ, పదివేల సార్లు వేద శ్లోకాలు పఠించడం, సహస్ర ఘటాభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. పూర్వకాలంలో వానలు కురవని దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడినప్పుడు రాజులు, ఋషులు వరుణయాగం చేసేవారని, యాగ ఫలితంగా వర్షాలు కురిసేవని తెలిపారు. ఈ వరుణ యాగంతో మన ప్రాంతమంతా వర్షాలు చక్కగా కురవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ యాగంతో తప్పకుండా వరుణదేవుడు అనుగ్రహిస్తాడని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## సమృద్ధిగా వర్షాలు కురువాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి ప్రత్యేక పూజలు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): గోదావరి గట్టున ఉన్న శ్రీ ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ యాగం కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ప్రజల సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడిని ప్రార్థిస్తూ యాగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే ఆదిరెడ్డికి స్వాగతం పలికారు.

## మంచి మార్కులతో లోకేశ్‌కు గిఫ్ట్ ఇస్తారా? : ఎమ్మెల్యే నసీర్

**●మీరు అడిగినవన్నీ చేస్తా... పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తా**

గుంటూరు (చైతన్యరథం): "పాఠాలు బాగా చదువుతున్నారా? అర్థమవుతున్నాయా? స్కూల్ బ్యాగ్స్ బాగున్నాయా? మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందా? ఇంకా మీ పాఠశాలకు ఏమి కావాలి? పాఠశాలకు మీరు అడిగినవన్నీ చేస్తాను. మంచి మార్కులు తెచ్చుకుని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు గిఫ్ట్ ఇస్తారా ?" అని విద్యార్థులతో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ముచ్చటించారు. మంగళవారం స్థానిక 54వార్డులో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. అందులో భాగంగా భారత్ పేట మున్సిపల్ పాఠశాలను డీఈవో షేక్ సలీం బాషా, ఎంఈవో ఖుద్దూస్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, వంట గది, పాఠశాల ప్రాంగణం, తరగతి గదులను పరిశీలించారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాటామంతీ కలిపారు. పాఠశాలలో విద్యా విధానం, విద్యార్థుల ప్రోగ్రెస్ గురించి ఆరా తీశారు. పాఠశాలకు ఏమేమి సదుపాయాలు కావాలో ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 600 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, అదనపు తరగతి గదులు అవసరమని ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డీఈవో, ఎంఈవోలతో ఎమ్మెల్యే నసీర్ చర్చించారు. వీటితోపాటు పాఠశాలలకు అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో పాఠశాలను తీర్చిదిద్దుతామని చెప్పారు. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు.



**54 వార్డులో పర్యటన**

స్థానిక కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ 54వ వార్డులో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి శానిటేషన్, మంచినీటి సరఫరా వంటి అంశాలపై ఆరా తీశారు. కొందరు నీరు దుర్వాసన వస్తున్నాయని ఫిర్యాదు చేయడంతో వెంటనే సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. నీటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, క్లోరినేషన్ సక్రమంగా జరగాలని ఆదేశించారు. శానిటేషన్ విషయంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో సిల్ట్ తీత పనులు చేపట్టాలని సూచించారు.

## జగ్గంపేటలో రూ.25 లక్షలతో మినీ రైతు బజార్‌కు శంకుస్థాపన



జగ్గంపేట (చైతన్యరథం): పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా జగ్గంపేటలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న మినీ రైతు బజార్ శంకుస్థాపన మహోత్సవం ఘనంగా జరిగింది. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆడపా భరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు ఎంతో అండగా గతంలో రైతు బజార్లను తీసుకువచ్చారని, పట్టణాలకే పరిమితమైన రైతు బజార్లను ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించడం జరిగిందని అన్నారు. జగ్గంపేటలో రూ.25 లక్షల వ్యయంతో 20 షాపులతో మినీ రైతు బజార్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, దీని ద్వారా రైతులు దళారులు లేకుండా నేరుగా తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ రైతు బజార్ ద్వారా జగ్గంపేటలోని 24 వేల మంది ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కలిపి 40 వేల మందికి ప్రతిరోజూ తాజా, శుభ్రమైన కూరగాయలు లభిస్తాయని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల కుటుంబాలకు అండగా పీ-4 పథకం : బొండా సిద్ధార్ధ



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ తూర్పు నియోజకవర్గం సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు వారి కార్యాలయం వద్ద 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన 2 ఇద్దరు తమ కుటుంబం నిరుపేద కుటుంబమని తమకు తోపుడుబండ్లను అందజేస్తే కూరగాయల అమ్ముకొని జీవనం సాగించి కుటుంబాన్ని పోషించుకుంటానని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావుకి తెలియజేయగా వెంటనే స్పందించిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ పీ-4 కార్యక్రమం ద్వారా ఇతరు లబ్ధిదారులకు రెండు తోపుడుబండ్లను వారికి స్వయంగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బొండా సిద్ధార్థ మాట్లాడుతూ... పేద కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా, వారికి ఉపాధి కల్పించి, స్వయం సమృద్ధి సాధించేలా చేయడమే పీ-4 కార్యక్రమం ఉద్దేశమని, ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలనకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించాలంటే ప్రతి కుటుంబానికి ఒక స్థిరమైన ఆదాయ మార్గం ఉండాలని, అందుకే స్వయం ఉపాధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కూరగాయల వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతో తమ కుటుంబాలను పోషించుకోవడంతో పాటు పిల్లల చదువులు, ఇతర కుటుంబ అవసరాలను తీర్చుకునే అవకాశం ఈ రెండు కుటుంబాలకు లభిస్తుందని, పీ4 ద్వారా అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లబ్ధిదారులకు సూచించారు.

## హామీ ఇచ్చా.. ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తా : మంత్రి కొల్లు రవీంద్ర

●ప్రత్యేక ప్రణాళికతో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి

●అభివృద్ధిలో రాష్ట్రానికి ఆదర్శంగా బందరుని తీర్చిదిద్దుతా



మచిలీపట్నం (చైతన్యరథం): ఓట్లు అడిగినపుడు హామీ ఇచ్చాను. మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధికి కేంద్రంగా మారుస్తానని. ఆ మేరకు వీబీజీ రాం జీ, సాస్కీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు శంకుస్థాపనలు చేశారు. మచిలీపట్నం రూరల్ మండలం పెదపట్నం గ్రామంలో 1వ నెంబర్ బ్రాంచ్ కెనాల్ పైన రూ.12.50 లక్షల వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కానూరు గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి సారంగపాలెం వరకు రూ.1.56 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తాళ్లపాలెం గ్రామంలో పెదపట్నం రోడ్డు నుండి జొన్నలవారిమోడి వరకు రూ.2.49 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బొర్రపోతుపాలెం గ్రామంలో ఏలూరు రోడ్డు నుండి బొర్రపోతుపాలెం వరకు రూ.1.04కోట్ల SASCI నిధులతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కర్రగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలోని క్యాంబెల్ పేట నుండి బందరు పోర్టు వరకు రూ.2.73 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణ పనులకు శంకస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు, ప్రజారోగ్యానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పేర్కొన్నారు.

**ఇంటింటికీ మంచినీరు**

ఇంటింటికీ మంచి నీళ్లు ఇవ్వడానికి మనకి 'జల్ జీవన్ మిషన్' ద్వారా రూ.80 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్ ఇస్తున్నాం. సంవత్సర కాలంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచి నీరు ఇచ్చే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వం కూడా తీసుకుంది. ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 'జీ రామ్‌జీ నిధుల నుండి 50% రాష్ట్ర ప్రభుత్వం 50% ఖర్చు చేస్తున్నాం. తాజాగా రూ.11వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా పనులు ప్రారంభించారు. సిమెంట్ రోడ్లన్నీ కూడా అభివృద్ధి చేసుకుంటున్నాం. మరోవైపు సంక్షేమ పథకాలను కూడా పకడ్బందీగా అమలు చేస్తున్నాం. హామీ మేరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందిస్తున్నాం. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలన్నీ పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వీటికి తోడుగా మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, చేనేతల సేవలో వంటి పథకాలు అమలు చేస్తున్నాం. మత్స్యకార సేవలో కార్యక్రమం ద్వారా బోటులో ఎంతమంది కళాసీలు ఉంటే అంతమందికి 20 వేల రూపాయల చొప్పున అందిస్తున్నాం.

**రూ.8వేల కోట్ల పెట్టుబడితో షిప్‌యార్డ్**

దశాబ్దాల పోరాటాల ఫలితంగా బందరు పోర్టు పూర్తవుతోంది. కొత్తగా పరిశ్రమలు కూడా వస్తున్నాయి. రూ.8000 కోట్ల పెట్టుబడితో 'గోవా షిప్‌యార్డ్' సంస్థ బందరు వస్తోంది. 10,000 మందికి ఉద్యోగాలు వస్తాయి. అది పూర్తయితే మన పిల్లలు ఉద్యోగాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన పని లేదు. ఇక్కడే ఉద్యోగాలు వచ్చేలా స్కిల్ నేర్పిస్తాం. రెండు సంవత్సరాల్లో గోవా షిప్ యార్డ్ కంపెనీ నిర్మాణం పూర్తవుతుంది. బందరు నుండి కృత్తివెన్నును కలుపుతూ ఓడపల్లి వరకు ఒక నేషనల్ హైవే కోసం ప్రయత్నం చేస్తున్నాం. అది వస్తే మన ఏరియా అంతా బంగారమవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు

●విజయవాడ 2వ డివిజన్‌లో కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



విజయవాడ (చైతన్యరథం): తూర్పు నియోజకవర్గ పరిధిలో ప్రధాన ప్రాంతమైన 2వ డివిజన్‌లో రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 2వ డివిజన్ మాచవరం డౌన్ ఏరియాలో ఆర్.ఆర్.చికెన్ సెంటర్ దగ్గర జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... మాచవరం డౌన్‌ను చుట్టగుంట అని కూడా పిలుస్తారని, ఈ ప్రాంతానికి రెవెన్యూ రికార్డులలో కూడా చుట్టగుంట అనే పేరు ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో వర్షం పడగానే ఈ ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉంటుందని చెప్పారు. నగరంలో ప్రధానమైన రోడ్లల్లో ఒకటైన ఏలూరు రోడ్డుపై నీరు నిల్వ ఉండి రాకపోకలు సాగించడానికి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, 2014వ సంవత్సరంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. 2014--19 టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్.ఆర్.ఆర్. కాలేజీ దగ్గర ప్రధానంగా నీళ్లన్నీ ఉండేచోట ఎల్అండ్‌టీ వారి సహకారంతో అప్పటి కేంద్ర మంత్రి ఎం. వెంకయ్య నాయుడు ఇచ్చిన నిధులతో పెద్ద కల్వర్టు నిర్మాణం చేశామన్నారు. దానివల్ల అక్కడ చుక్క నీరు నిల్వ ఉండడం లేదని చెప్పారు. కేంద్రం నుంచి ఇటీవల మంజూరైన రూ.7 కోట్ల రూపాయలతో ఏలూరు రోడ్డు మీద నీరు ఉండకుండా చేయడానికి లైనింగ్‌లు వేసి, లెవెల్స్ చేసి, కొండ మీద నుంచి పడినా ప్రతి వర్షపు చుక్క కాలువలోకి వెళ్ళిపోయేటట్లు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.

## దాహార్తి తీర్చే బృహత్ ప్రాజెక్ట్... రూ.91.13 కోట్లతో 'అమరజీవి జలధార'

●కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుచూపుతో అడుగులు వేస్తోంది : ఎమ్మెల్యే అరవిందబాబు



నర్సరావుపేట (చైతన్యరథం): నర్సరావుపేట నియోజకవర్గ ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 'జల్ జీవన్ మిషన్ 2.0– అమరజీవి జలధార' పథకం కింద రూ.91.13 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన తాగునీటి సదుపాయ పనులకు మంగళవారం కోటప్పకొండ శివకుటుంబం వద్ద అత్యంత ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు ముఖ్య ప్రారంభకులుగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజల బాగోగులు, సంక్షేమం, సమగ్ర అభివృద్ధి పట్ల ఎంతో ముందుచూపుతో కార్యాచరణ రూపొందించి అడుగులు వేస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమస్యలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కారాలు చూపుతున్నాం. ఇందులో భాగంగానే నర్సరావుపేట నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలకు శాశ్వత ముగింపు పలకడమే మా సంకల్పం. ఇప్పుడు రూ.91.13 కోట్ల భారీ నిధులతో ప్రారంభమైన ఈ 'జల్ జీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార' ప్రాజెక్ట్ నియోజకవర్గ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ దక్కిన ఒక పెద్ద తాగునీటి వరప్రసాదమని అన్నారు.

## అమరజీవి జలధార ద్వారా 162 గ్రామాలకు రక్షిత త్రాగు నీరు

●రూ.72.57 కోట్లతో ఇంటింటికి త్రాగునీరు పథకం పనులకు శంకుస్థాపన చేసిన చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ మండలం వెంకుపాలెం గ్రామంలో రూ. 20.35 లక్షల వ్యయంతో చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... వినుకొండ నియోజకవర్గ పరిధిలోని 162 గ్రామాలకు 'అమరజీవి జలధార' ద్వారా రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా రూ. 72.57 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులను ప్రారంభించామని తెలిపారు. దీని ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసి, ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందిస్తామని పేర్కొన్నారు.

**ఎల్ నినో ప్రభావం తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలి**

వినుకొండ మండలం మదమంచిపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన వరుణ యాగంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురవాలి పాడిపంటలు సమృద్ధిగా పండి, రైతన్నలు సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలు అడ్డుకోవాలన్న జగన్ ఆలోచనలు.. అనైతికం, అప్రజాస్వామికం

●ఓటమి తప్పదని తెలిసే ప్రజాక్షేత్రంలో పోరాటానికి వెనకడుగు వేస్తున్నారు : టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): "అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిస్థానంలో ఉండి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బలవంతపు ఏకగ్రీవాలు, నామినేషన్ల అడ్డగింతలు, అభ్యర్థుల్ని బెదిరించడం, బరిలో నిలిచినవారిని భయపెట్టేందుకు ఏకంగా చంపేయడం వంటి అప్రజాస్వామిక చర్యల్ని అడ్డగోలుగా ప్రోత్సహించారు. జగన్. వైసీపీ నేతలు నాడు తమ దుర్మార్గపు పోకడలతో స్థానిక ఎన్నికల్లో గెలిచి, నిస్సిగ్గుగా సంబరాలు చేసుకున్నారు. అటువంటి వారు నేడు ప్రజాస్వామ్యయుతంగా, ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్రంలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్ని అడ్డుకునేందుకు తప్పుడు కారణాలతో కోర్టుల్లో నిరాధారమైన కేసులు వేయడం సిగ్గుచేటు. బీసీ రిజర్వేషన్ల అమలు, స్థానిక ఎన్నికల నిర్వహణపై వైసీపీ సానుభూతిపరులు న్యాయస్థానాలకు తప్పుడు సమాచారం అందిస్తూ, వ్యవస్థల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ఆరువారాల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలన్న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలపైనా వైసీపీ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. కచ్చితంగా అప్రజాస్వామికమే. బీసీలకు సముచిత రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి.. వారికి రాజకీయంగా న్యాయం చేయాలన్న కూటమి ప్రభుత్వ సదాశయాన్ని కూడా జగన్ నీరుగారుస్తున్నాడు. 34 శాతం రిజర్వేషన్ల అమలును అడ్డుకుంటూ ఏకంగా సుప్రీం తలుపుతట్టాడు. తన పాలనలో బీసీలను రాజకీయంగా అణగదొక్కిన జగన్.. నేడూ అదే పంథాను అనుసరిస్తున్నాడు. జగన్.. వైసీపీ నేతల వైఖరి ముమ్మాటికీ అనైతికత.. అప్రజాస్వామికమే. ప్రజలు స్థానిక ఎన్నికల్ని త్వరగా నిర్వహించాలని కోరుతున్న తరుణంలో వారి అభిప్రాయాలకు విరుద్ధంగా జగన్. వైసీపీ వ్యవహరించడం సిగ్గుచేటు.

**ఓటమి తప్పదని తెలిసే.. జగన్ ప్రజాక్షేత్రంలో పోరాటానికి వెనకడుగు**

సకాలంలో ఎన్నికలు జరపకుంటే రాష్ట్రానికి వచ్చే కేంద్ర నిధులు ఆగిపోతాయని తెలిసినా జగన్ తన కుట్రలు కొనసాగించడం ప్రజాద్రోహం కాదా? గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కన్నా... తన పట్టింపులు, పంతాలు, రాజకీయాలకే జగన్ ప్రాధాన్యత ఇస్తున్న జగన్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు.

## రైతు సంక్షేమం కోసం ఎమ్మెల్యే బూర్ల వరుణ యాగం

ప్రత్తిపాడు (చైతన్యరథం): ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పచ్చని పంటలతో సస్యశ్యామలంగా, రైతన్నలు సుభిక్షంగా ఉండడంతో పాటు ప్రజలకు సాగునీరు, తాగునీటి కొరత లేకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, సీఎం నారా చంద్రబాబు ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వరుణ యాగం కార్యక్రమాల్లో భాగంగా వట్టిచెరుకూరు మండలం, చామల్లమూడి గ్రామంలో శ్రీసీతారామ స్వామి వారి ఆలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాములస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండాలని, రైతన్నలు ఆనందంగా ఉండాలని, ప్రజలకు సాగునీరు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారికి ఎమ్మెల్యే ప్రార్థించారు.

జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం

## ప్రతి ఇంటికి సౌర విద్యుత్.. ప్రధాని సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

●అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు చేరాలి : ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): ప్రతి ఇంటికి సౌర విద్యుత్, ప్రధాన సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేకోవాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. మంగళవారం అజిత్‌సింగ్ నగర్ కరెంటు ఆఫీస్ విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయం నందు, ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వినియోగదారులు సౌర విద్యుత్‌ను వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయం పరిధిలో "సేవా సేతు క్యాంప్ – సోలార్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్" నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు, ఈ సందర్భంగా వినియోగదారులతో మాట్లాడి సౌర విద్యుత్ వినియోగం, ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా లభించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సౌర విద్యుత్‌తో విద్యుత్ ఖర్చులకు ఉపశమనం ఇంటి పైకప్పులపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని బొండా ఉమా తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని చెప్పారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద అర్హత ఉన్న వినియోగదారులు తప్పనిసరిగా నమోదు చేసుకుని పథకం ద్వారా లభించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం సేవా సేతు క్యాంప్‌లో పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ, అర్హతలు, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు, ప్రభుత్వ ప్రయోజనాలు తదితర అంశాలపై విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారులకు వివరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు నేరుగా చేరేలా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని బొండా ఉమా పేర్కొన్నారు.

## గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

●ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వర్చువల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): గిద్దలూరు నియోజకవర్గం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోనే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మార్కాపురం కలెక్టర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ – విలేజ్ హెల్త్ క్లినిక్ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు మండలంలోని వెల్లుపల్లి గ్రామానికి చెందిన విలేజ్ హెల్త్ సెంటర్ శిలాఫలకం ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు స్థానికంగానే అందేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రజలు ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించగా, మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజాసేవకు గుర్తింపుగా సేవా సంకల్ప్ అభియాన్



దర్శి (చైతన్యరథం): భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని, ఆయన 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాసేవను పురస్కరించుకుని 2026 సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాళ్లూరు మండలం తూర్పు గంగవరం పంచాయతీలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామం లో హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేసి ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోడీ పాతికేళ్లుగా నిరంతరం ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన నాయకత్వంలో దేశం సంక్షేమం మరియు అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కొనియాడారు.

## వర్షాలు విస్తారంగా కురవాలి-వరుణ యాగంలో మంత్రి నారాయణ

●ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావం

●రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వరుణ యాగాలు



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి జలాశయాలు నిండాలని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆకాంక్షించారు. నెల్లూరు సిటీ మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగంలో మంత్రి నారాయణ తన కుమార్తె షరణితో కలిసి పాల్గొన్నారు. యాగంలో పూర్ణాహుతి సమర్పించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సాధారణంతో పోలిస్తే వర్షపాతం 54 శాతం తక్కువగా నమోదైందని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఉత్తరాంధ్రలో పరిస్థితి కొంత మెరుగుపడిందని తెలిపారు. అయితే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలు కురవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసుకునేందుకు అవసరమైన నీరు అందుబాటులోకి రావాలని, ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలని ప్రార్థించానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జనార్ధన్, ఈవో జానకి, ఆలయ చైర్మన్ వేలూరు పెంచలరాజు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, డివిజన్ టీడీపీ నేతలు గండవరం నాని పాల్గొన్నారు.

## నర్రవాడ పీహెచ్‌సీలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకస్మిక తనిఖీ..!

●ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.. అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు..!



ఉదయగిరి (చైతన్యరథం): దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఆరోగ్య కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యే అక్కడి వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని జనరల్ వార్డు, కాన్పుల గది, వైద్య పరీక్షల గదులు, రోగుల కోసం అందుబాటులో ఉన్న ఇతర సౌకర్యాలను ఎమ్మెల్యే గారు పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, వైద్య సిబ్బంది హాజరు, పారిశుద్ధ్య నిర్వహణ, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై సంబంధిత వైద్యులు, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో వైద్య సేవలు, అవసరమైన మందులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు వైద్య సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, మందులు అందుతున్నాయా, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను స్వయంగా తెలుసుకున్నారు.

## వరుణ దేవుని యాగంలో ఎమ్మెల్యే ముత్తుముల ప్రత్యేక పూజలు



గిద్దలూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం దేశంలో, రాష్ట్రంలో ఎలినో ప్రభావంతో వాతావరణం పరిస్థితులు సరిగా లేదని వర్షాలు సరిగా పడటంలేదని రాష్ట్రంలోని 175 దేవాదాయ మరియు ధర్మాదాయ ఆలయాలలో వరుణ దేవుని యాగం నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా గిద్దలూరు పట్టణంలోని పాతాల నాగేశ్వరస్వామి దేవస్థానం నందు వరుణ దేవుని యాగంలో "ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు, యాగ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తుముల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎలినో ప్రభావంతో అత్యంత తీవ్ర రూపం దాల్చిన పరిస్థితి ఉందని, దాని నుంచి మన రాష్ట్రం కాపాడబడి వర్షాలు సక్రమంగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో వర్షాలు పూర్తిస్థాయిలో కురిస్తే ఈ ప్రాంతంలో కూడా సస్యశ్యామలంగా ఉండాలనే ఉద్దేశంతోనే శ్రీ పాతాళ నాగేశ్వరావు దేవాలయంలో వరుణ యాగంలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ దేవాలయంలోని శివపార్వతుల ఆశీస్సులతో మా భక్తి శ్రద్ధ పూజలతో తప్పకుండా వరుణదేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురువాలని రాష్ట్రమంతా మరియు నియోజకవర్గంలో వర్షాలతో సుభిక్షంగా ఉండి ఎలినో ప్రభావం నుండి రైతులు ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని ఆ దేవుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ కూటమి ప్రభుత్వ నాయకులు, ప్రముఖులు, దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు , భక్తులు ఈ వరుణ దేవుని యాగంలో పాల్గొన్నారు.

## రాష్ట్ర సస్యశ్యామలమే లక్ష్యంగా వరుణ యాగం చేపట్టిన టీడీపీ నేత ఎరిక్షన్ బాబు



యర్రగొండపాలెం (చైతన్యరథం): రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలి... రైతన్నలు సుభిక్షంగా ఉండాలి... ప్రజలకు సాగునీరు, తాగునీటికి ఎలాంటి కొరత లేకుండా ఆంధ్రప్రదేశ్ సస్యశ్యామలంగా ఉండాలనే మహోన్నత సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గం త్రిపురాంతకం మండలంలోని శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ యాగం పూజా కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పం సాకారం కావాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆకాంక్షించారు.

## రోజురోజుకూ టీడీపీలోకి వలసల వెల్లువ : ఎమ్మెల్యే కందికుంట

●వైసీపీని వీడి టీడీపీలో చేరిన 150 ముస్లిం మైనార్టీ కుటుంబాలు




కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, అన్ని వర్గాల ప్రజలు టీడీపీతో కలిసి ముందుకు వస్తున్నారని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక సీమంతం కార్యక్రమం అనంతరం 23వ వార్డుకు చెందిన 150 ముస్లిం మైనార్టీ కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. 23వ వార్డు టీడీపీ నాయకులు ముబారక్, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ కుటుంబాలు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి, పార్టీ కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా పార్టీలో చేరిన కుటుంబాలకు అండగా ఉంటామని, టీడీపీ కుటుంబంలో వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.

## మడకశిరలో రూ.1.20 కోట్లతో ఆర్‌డీఓ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన



మడకశిర (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఆర్‌డీఓ (RDO) కార్యాలయ భవన నిర్మాణ పనులకు రూ.1.20 కోట్ల వ్యయంతో మంగళవారం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బి.సి. సంక్షేమం, చేనేత మరియు జవుళి శాఖామాత్యులు సవిత ముఖ్య అతిథిగా హాజరై, ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు.

## సురుటపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వరుణయాగం




నాగలాపురం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం వరుణయాగం కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కూరపాటి శంకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు కూటమి నాయకులు, స్థానిక నాయకులు, ఏడు మండలాల మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, పీఏసీ చైర్మన్లు, పీఏస్ సభ్యులు, ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు, రైతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో పుష్కలంగా వర్షాలు కురిసి, చెరువులు, కుంటలు నీటితో నిండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలకు నీటి కొరత లేకుండా రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వరుణయాగం, అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## విస్తారంగా వర్షాలు కురువాలని వరుణయాగం



మదనపల్లె (చైతన్యరథం): రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి జలాశయాలు నిండాలని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని టీడీపీ నాయకులు వ్యాఖ్యానించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు... రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో వర్షాలు సకాలంలో కురవాలని ప్రజలకు త్రాగునీరు, సాగునీరు అందించే విధంగా వరుణదేవుడు కనుకరించి సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ స్థానిక శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి దేవస్థానంలో వరుణ యాగం, వరుణ జపం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

## వర్షాలు కురిసి రైతన్నల జీవితాల్లో సుభిక్షం వెల్లివిరియాలి

●వరుణ యాగంలో పాల్గొన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



డోన్ (చైతన్యరథం): రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని, రైతన్నలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సాగు మరియు తాగునీటికి ఎలాంటి కొరత లేకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'వరుణ యాగం'లో భాగంగా బేతంచర్ల మండలం ఆర్.ఎస్. రంగాపురం గ్రామంలోని శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ముఖ్యంగా రైతన్నలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడి, సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని ఆకాంక్షించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్న ఎమ్మెల్యే గారు రైతులకు సాగునీరు అందుబాటులో ఉండటంతో పాటు ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందేలా ప్రకృతి సహకరించాలని కోరుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, రాష్ట్ర సౌభాగ్యం కోసం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. వరుణ దేవుడి కరుణతో రాష్ట్రం పచ్చని పంట పొలాలతో కళకళలాడాలని, రైతన్నల ఇళ్లలో ఆనందం వెల్లివిరియాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## గోరంట్లలో వైభవంగా 'అన్న క్యాంటీన్' ప్రారంభోత్సవం



గోరంట్ల (చైతన్యరథం): గోరంట్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'అన్న క్యాంటీన్'ను బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు, పెనుకొండ శాసనసభ్యులు ఎం.ఎస్.రాజు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ శామ్యూల్ జయకమల్ (పానబాకం జయకమల్) ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి వైభవంగా ప్రారంభించారు. పేద ప్రజల ఆకలి తీర్చడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తోందని, రూ.5కే నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడం హర్షణీయమని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తమ కుటుంబ సభ్యులతో సహా అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రేణులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజల సందడితో ప్రారంభోత్సవ ప్రాంగణం కోలాహలంగా మారింది. నాయకులు స్వయంగా ప్రజలకు ఆహారాన్ని వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.

## కందుకూరు జనార్ధనస్వామి ఆలయంలో వరుణయాగం



కందుకూరు (చైతన్యరథం): రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ... ప్రభుత్వ ఆదేశాలతో కందుకూరులో మంగళవారం వరుణయాగం నిర్వహించారు. జనార్ధనస్వామి దేవాలయంలో జరిగిన యాగంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సహా బిజెపి, జనసేన నేతలు పాల్గొన్నారు. ముందుగా పండితులు, అధికారులు... ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. జనార్ధనస్వామి, వెంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం యాగక్రతువు నిర్వహించారు. ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.... ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దేవుళ్ళ చల్లని చూపుతో వర్షాలు బాగా కురవాలని, వరుణ యాగం నిర్వహించినట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని చెప్పారు.

## రాష్ట్రీయ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ




కదిరి (చైతన్యరథం): పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ మైదానంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ రాష్ట్రీయ పోషణ మాసం మరియు అంగన్వాడి ఉత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బికె పార్థసారథి గర్భవతులకు చీర, పసుపు కుంకుమ అందజేశారు. స్త్రీ, శిశు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయబద్ధంగా సామూహిక సీమంతం నిర్వహించి, పసుపు, కుంకుమ, చీరలు, గాజులను అందజేశారు. గర్భిణీ స్త్రీలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కదిరి నియోజకవర్గంలో సామూహిక సీమంతం కార్యక్రమాన్ని మూడోసారి ఘనంగా నిర్వహించడం విశేషం. గర్భిణీ స్త్రీలకు మన సాంప్రదాయంలో ఉన్న గౌరవాన్ని చాటుతూ, వారిలో ఆనందాన్ని నింపేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అంగన్వాడీ సిబ్బందికి ఘన సన్మానం

ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బందిని ఘనంగా సత్కరించి సన్మానించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల పోషణ, ఆరోగ్యం విషయంలో అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన ఆడపడుచులకు ఎండ తీవ్రత ఇబ్బంది కలగకుండా రక్షణ ఏర్పాట్లు పెద్దఎత్తున చేపట్టారు.

## వరుణ దేవుని కృపతో పుష్కలంగా వర్షాలు కురవాలి : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి (చైతన్యరథం): వెంకటగిరి పట్టణంలోని శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద నిర్వహించిన వరుణ యాగ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన యాగంలో ఎమ్మెల్యే గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో, వరుణ దేవుని కృపతో ఈ సంవత్సరం పుష్కలంగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



# ఆవిష్కరణలకు వేదిక

## విద్యార్థులకు స్టార్టప్ పోటీలు

**కమ్మింగ్, అట్లాంటా, జార్జియా:** డెన్మార్క్ హైస్కూల్, సౌత్ ఫోర్సిత్ హైస్కూల్, వెస్ట్ ఫోర్సిత్ హైస్కూల్, అలయన్స్ అకాడమీ ఫర్ ఇన్నోవేషన్, నార్త్‌వ్యూ హైస్కూల్‌కు చెందిన సీనియర్ విద్యార్థుల బృందం ఇటీవల 'ఇన్నోవేట్ ఏటీఎల్' కోసం 200 మందికి పైగా విద్యార్థులు, మార్గదర్శకులు, న్యాయనిర్ణేతలు, సమాజ సభ్యులను ఒకచోట చేర్చింది. ఇది యువ వ్యవస్థాపకులకు తమ ఆలోచనలను నిజమైన స్టార్టప్‌లుగా మార్చే అవకాశాన్ని అందించడానికి రూపొందించిన ఒక స్టార్టప్ వ్యవస్థాపక పోటీ. ఆవిష్కరణలపై ఉన్న ఉమ్మడి ఆసక్తితో ఫోర్సిత్ కౌంటీ, విస్తృత అట్లాంటా ప్రాంత పాఠశాలల నుంచి విద్యార్థుల బృందం సరోష్ దొడ్డాక, సిద్ధార్థ్ పుచ్చకాయల, సౌమిత్ కొండమడుగుల, సాయిచరణ్ చౌదరపు, నరేష్ రాజేష్, అభిరామ్ తుమ్మలపల్లి, తనిష్ జంపాల, రెక్స్ జాంగ్ కలిసి ఇన్నోవేట్ ఏటీఎల్‌ను నిర్వహించారు. వెస్ట్ ఫోర్సిత్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది.





**పోటీలకు 70కి పైగా బృందాలు**

స్టార్టప్‌ల కోసం 70కి పైగా బృందాలు పాల్గొన్నాయి. ఒక సమస్యను గుర్తించడం, దాని చుట్టూ ఆచరణీయమైన వ్యాపారాన్ని అభివృద్ధి చేయడం, చివరిగా అట్లాంటాలోని వ్యవస్థాపకత, సాంకేతి కత, పెట్టుబడి రంగాల నిపుణులకు తమ ఆలోచనలను వివరించడం వంటి సవాళ్లను విద్యార్థులకు ఇచ్చారు. రోజంతా పోటీదారులు తమ స్టార్టప్‌ల యొక్క ప్రధాన అంశాలైన ఉత్పత్తి, మార్కెట్‌లోకి ప్రవేశించే వ్యూహం, ప్రధాన నమూనా, పోటీతత్వ ప్రయోజనం, పిచ్‌లను అభివృద్ధి చేశారు. ఆ తర్వాత బృందాలు ప్రాథమిక న్యాయనిర్ణయ రౌండ్లలో పోటీపడ్డాయి. వాటిలో అత్యంత బలమైన బృందాలు తర్వాత జరిగే డీల్ రౌండ్‌కు అర్హత సాధించాయి. విష్ణు కొంగ, రిషబ్ కుమార్, అనంత్ వర్మ, ఆద్యంత్ రాజు మొదటి స్థానం సాధించడంతో పోటీ ముగిసింది.

**విజేత జట్టుకు నగదు బహుమతి**

విజేత జట్టుకు $500 నగదు బహుమతితో పాటు జార్జియా టెక్ క్రియేట్-జేఈ డెమో డేకు వీఐపీ ప్రవేశం లభించింది. ఇది విద్యార్థులకు అట్లాంటా స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను మరింతగా అనుభవించే అవకాశాన్ని కల్పించింది. ఈ కార్యక్రమంలో $1,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు ప్రదానం చేయబడ్డాయి. రెండవ, మూడవ స్థానంలో నిలిచిన జట్లకు, చిన్న ఛాలెంజర్ విభాగాల విజేతలకు అదనపు బహుమతులు అందజేశారు. ఉన్నత పాఠశాల విద్యార్థులే కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేకత. ఈ పోటీని మొదటి నుంచి అభివృద్ధి చేయడానికి నెలల తరబడి శ్రమించారు. ఈ కార్యక్రమానికి జార్జియా టెక్ క్రియేట్-ఎక్స్, జార్జియా టెక్ సీఈఐఎస్ఎంసీ, ఎంగేజ్, టెక్ స్క్వేర్ వెంచర్స్ వంటి సంస్థలతో అనుబంధం ఉన్న నిపుణులు, అట్లాంటాలోని వ్యవస్థాపక వర్గానికి చెందిన ఇతర సభ్యుల నుంచి మద్దతు లభించింది.



# ఛార్లెట్‌లో తానా 'విల్ అండ్ ట్రస్ట్ డ్రైవ్'





**అమెరికా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఛార్లెట్ విభాగం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, మరోవైపు కమ్యూనిటీకీ ఎన్నో విషయాల్లో జాగ్రత్తలను తెలియజేస్తూ, చైతన్యపరిచే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా అక్టోబర్ 4వ తేదీన నిర్వహించిన 'విల్ అండ్ ట్రస్ట్ డ్రైవ్' విజయవంతంగా ముగిసింది. అనిశ్చిత పరిస్థితులలో కుటుంబాలకు ఆర్థిక.. చట్టపరమైన భద్రతను కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోస్పర్ రైట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వారితో కలిసి తానా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఫైనాన్షియల్, బిజినెస్ విషయాల్లో మంచి అవగాహన ఉన్న జ్యోత్న్న గంట ఈ కార్యక్రమం ద్వారా విల్ అండ్ ట్రస్ట్‌కు సంబంధించిన విషయాల్లో పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో 120 మందికి పైగా పాల్గొని తమ సందేహాలను.. ఇతర విషయాలను నివృత్తి చేసుకున్నారు. తమ వీలునామాలు సిద్ధం చేసుకోవడానికి.. ముఖ్యమైన కుటుంబపత్రాలను పూర్తి చేయడానికి



ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ కార్యక్రమానికి మంచి స్పందన రావడం పట్ల ఛార్లెట్ తానా నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఛార్లెట్‌తో పాటు.. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అనేక కుటుంబాలు ఈ కార్యక్రమానికి హాజరయ్యాయి. ప్రతిఒక్కరూ తమ పత్రాలను పూర్తి చేయడానికి సాయంత్రం వరకు వేచి ఉన్నారు. ఇది ఎప్పటి నుంచో వాయిదా పడుతున్న ఈ పనిని ఎట్టకేలకు పూర్తి చేయా లనే వారి పట్టుదలను తెలియజేసింది.

ప్రజల నుంచి వచ్చిన విపరీతమైన స్పందనతో.. ప్రతి ఒక్కరూ తమ పత్రాలను పూర్తి చేసుకునేలా ఈ కార్యక్ర మాన్ని సాయంత్రం 7:30 గంటల వరకు నిర్వాహకులు పొడిగించారు. ఈ కార్యక్రమంలో పలు కుటుంబాలకు నోటరీ సేవలను అందించిన సతీష్ జాస్తి, కోటయ్య పచ్చల.. తమకు సహాయం చేసిన ప్రసాద్ చిగురుపాటికు ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. రేపటి మన కుటుంబాల భవిష్యత్తు, భద్రత కోసం నేడు వేసే చిన్న అడుగు ఎంతో అర్థవంతమైన మార్పును తెస్తుందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. సేవా భావంతో కమ్యూనిటీ అంతా ఒకటై ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తానా ఛార్లెట్ నాయకులు, తానా స్పెషల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నాగ పంచుమర్తి, ఫౌండేషన్ ట్రస్టీ ఠాగూర్ మల్లినేని, తానా టీమ్ స్క్వేర్ చైర్మన్ కిరణ్ కొత్తపల్లి, హెల్త్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ మాధురి ఏలూరి, అప్పలాచియాన్ ప్రాంతీయ ప్రతినిధి రవి (నాని) వడ్లమూడి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతమయ్యేలా చూశారు.

# వారధి ఇండియా ఫౌండేషన్ వార్షికోత్సవం

**- ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు**




**హైదరాబాద్(చైతన్యరథం):** వారధి ఇండియా ఫౌండేషన్ 2026 వార్షికోత్సవం, బహుమతుల ప్రదానోత్సవాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో వారధి ఇండియా ఫౌండేషన్ ఈ వార్షిక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎస్‌సీఈఆర్‌టీ, తెలంగాణ ప్రభుత్వ సమగ్ర శిక్ష భాగస్వామ్యంతో నిర్వహించారు. వార్షికోత్సవంలో పర్యావరణ వేత్త, వాటా ఫౌండేషన్ వ్యవస్థాపక ట్రస్టీ ఉదయకృష్ణ పెద్దిరెడ్డి "మీరు చూడాలంటున్న మార్పు మీరే అవ్వండి" అనే అంశంపై ప్రసంగించారు. అనగనగా చిత్ర కథానాయకుడు సుమంత్ "నేర్చుకోవడంలోని ఆనందం" అనే అంశంపై తన ఆలోచనలను విద్యార్థులతో పంచుకున్నారు.

**విద్యార్థులకు పోటీలు**

విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచన, తమ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరచే సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు, విభిన్న దృక్పథాలను అర్థం చేసుకుని నిర్మాణాత్మకంగా చర్చించేలా ప్రోత్సహించేందుకు వారధి 2013 నుంచి వార్షిక పోటీలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 52 జిల్లాల నుంచి 305 మంది విద్యార్థు లు రాష్ట్రస్థాయి వ్యాసరచన, చర్చా పోటీల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాలో 25 జిల్లాలు, తెలంగాణలోని 33 జిల్లాలో 27 జిల్లాల నుంచి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. మొదటి బహుమతి రూ.33 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.27 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో



**రాష్ట్ర స్థాయి పోటీ ఫలితాలు**

| రాష్ట్రం | పోటీ | 1వ బహుమతి | 2వ బహుమతి | 3వ బహుమతి |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | వ్యాస రచన | ZPHS రాజంపాలెం | ఏపీ మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజ్, ఎడతలవలస | ZPHS, కల్లపవడ్లు; ZPHS పెదానింద్రకోలను |
| తెలంగాణ | వ్యాస రచన | ZPHS రాకోలు | ZPHS ఘనపూర్ | ZPHS నార్కెట్‌పల్లి; ZPHS కిష్టాపూర్ |
| ఆంధ్రప్రదేశ్ | డిబేట్ | PMSHRI ZPHS PLUS, APSP Quarters | ZPHS లింగారెడ్డిపాలెం | ZPHS అలకురపాడు; ZPHS రాజంపాలెం |
| తెలంగాణ | డిబేట్ | ZPHS నెహ్రూ నగర్ | TGRS నెక్కొండ | ZPHS కల్వాపూర్; ZPHS కిష్టాపూర్ |

విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, న్యాయ నిర్ణేతలు, స్వచ్ఛంద కార్యకర్తలు, వారధి మద్దతుదారులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**2017లో వారధి స్థాపన**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా 2017లో 'వారధి'ని స్థాపించారు. వ్యక్తులు, సంస్థలు, సమాజం మధ్య అనుసంధానాన్ని ఏర్పరచి అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలకు వేదికగా పనిచేస్తోంది. 'విద్య ద్వారా సాధికారత' అనే స్ఫూర్తితో యువత తమ వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమా జానికి, దేశానికి సానుకూల మార్పు తీసుకురాగలిగేలా వారిని తీర్చిదిద్దడం వారధి ప్రధాన లక్ష్యం. విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఆనందకరమైన అభ్యాస పద్ధతుల ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్, కోడింగ్ తరగతులను వారధి నిర్వహిస్తోంది. 'లెట్స్ టీచ్ ఇన్ ఇంగ్లీష్' కార్య క్రమం ద్వారా ఉపాధ్యాయులు తరగతి గదిలో మరింత ఆత్మవిశ్వాసంతో బోధించేం దుకు, సమర్థవంతమైన బోధనా పద్ధతులను అభివృద్ధి చేసుకునేందుకు తోడ్పడుతోంది.



## మోదీపై ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం

**ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రడ్ వ్యాఖ్య**



భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం ఉందని ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రడ్ పేర్కొన్నారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం వంటి కీలక సాంకేతిక రంగాల్లో భారత్-అమెరికా ముందుకు సాగుతున్న సమయంలో కెవిన్ రడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సుంకాలు, మార్కెట్ ప్రవేశంపై చర్చలు కఠినంగా ఉన్నప్పటికీ, అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చలలో భారతదేశం సాపేక్షంగా బలమైన స్థితిలో ఉందని రడ్ అన్నారు. ఇటీవల అమెరికాలో ఆస్ట్రేలియా రాయబారిగా తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న రడ్.. భారత్, ట్రంప్ ప్రభుత్వం మధ్య చర్చలు చురుకుగా కొనసాగుతున్నాయని, అంతిమ ఫలితం ఇద్దరు నాయకుల మధ్య రాజకీయ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ట్రంప్‌నకు భారత్ పట్ల ఉన్న సానుకూల దృక్పథం కారణంగా, అనేక ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మెరుగైన స్థితిలో ఉందని రడ్ పేర్కొన్నారు. అలాగే రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలో ప్రాణనష్టం తీవ్ర స్థాయికి చేరుకుందని, దౌత్య పరిష్కారానికి దోహదపడేందుకు భారతదేశం చేస్తున్న ప్రయత్నాలను తాను స్వాగతిస్తున్నానని రడ్ పేర్కొన్నారు. అలాగే జైశంకర్‌ను ప్రపంచవ్యాప్తంగా మంచి సంబంధాలున్న విదేశాంగ మంత్రిగా అభివర్ణించారు.

## ఆగి ఉన్న ట్రైలర్‌ను ఢీకొన్న బొలేరో

**దుర్ఘటనలో ఏడుగురి మృతి**



గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సర్వీస్ రోడ్డుపై ఆగి ఉన్న ట్రైలర్ ట్రక్కును ఓ బొలేరో వాహనం ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో భావ్‌నగర్-సోమనాథ్ జాతీయ రహదారిపై తలాజా తాలూకా త్రపాజ్ గ్రామం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు భావ్‌నగర్ నుంచి అలంగ్ వెళ్తుండగా.. సర్వీస్ రోడ్డుపై ఆగి ఉన్న ట్రైలర్‌ను వారి బొలేరో వాహనం బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. కారులో ఉన్న ఏడుగురిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. మృతులంతా స్థానిక షిప్‌యార్డులో పనిచేసేవారిగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. వాహనం నుజ్జునుజ్జు కావడంతో అందులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. తలుపులు తెరవడానికి రాడ్లువంటి పరికరాలను ఉపయోగించాల్సి వచ్చింది. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. వాహనం అతివేగమే కారణమా? లేక ఇతర అంశాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్టు జిల్లా ఎస్పీ నితేష్ పాండే తెలిపారు.

# రవాణాకు కొత్త అథారిటీ.. ఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్ల నిధి!

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ రవాణా, లాజిస్టిక్స్ వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు చిన్న, మధ్యతరహా సంస్థలకు దీర్ఘకాలిక పెట్టుబడి అందించేలా రెండు కీలక ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. "ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్‌లాజిస్టిక్స్ అథారిటీ" ఏర్పాటుతోపాటు"రూ.10వేలకోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్" ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### రవాణా రంగానికి ఐటీఎల్ఏ

రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో విభిన్న మంత్రిత్వ శాఖలు,సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు ఐటీఎల్ఏను ప్రత్యేక ప్రయోజన సంస్థగా ఏర్పాటు చేయనున్నారు. ఇది దేశంలో సమగ్ర రవాణా-లాజిస్టిక్స్ ప్రణాళికకు "అత్యున్నత సంస్థ"గా పని చేస్తుంది. పరిశోధన, విధాన రూపకల్పన, ప్రాజెక్టుల సాంకేతిక మదింపు, పర్యవేక్షణ, ప్రభావ అంచనా, డేటా విశ్లేషణ వంటి బాధ్యతలను నిర్వహిస్తుంది. ఐటీఎల్ఏ కనీసం పదేళ్ల కాలపరిమితితో "నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ మాస్టర్ ప్లాన్" రూపొందించనుంది. ఇందులో రోడ్లు, రైల్వేలు, పోర్టులు-షిప్పింగ్,సివిల్ ఏవియేషన్, అంతర్గత జలరవాణా, కోస్టల్ షిప్పింగ్, పట్టణ రవాణా, లాజిస్టిక్స్‌వంటి రంగాలను ఒకే సమగ్ర ప్రణాళికలోకి తీసుకురానుంది. రవాణా శాఖల ఐదేళ్ల, వార్షిక ప్రణాళికలు కూడా ఈమాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాన్ని ఐటీఎల్ఏ పరిశీలిస్తుంది.

రూ.500కోట్లకు పైబడిన కేంద్రప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఐటీఎల్ఏ సాంకేతిక మదింపు చేయనుంది. వాటి అమలును పర్యవేక్షించడంతోపాటు పూర్తయినతర్వాత ప్రభావాన్ని కూడా అంచనా వేస్తుంది. అయితే ఆ ప్రాజెక్టుల ఆర్థిక



మదింపు మాత్రం ప్రస్తుత విధానాల ప్రకారమే కొనసాగుతుంది. అంతేకాకుండా "నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ డేటా రిపాజిటరీ"ని ఏర్పాటు చేయనుంది. జీఎస్‌టీఎన్ ఈ-వే బిల్లులు, ఫాస్టాగ్, వహన్, జీపీఎస్, పట్టణ ట్రాఫిక్ వ్యవస్థలు తదితర వనరుల నుంచి డేటాను సమీకరించి రవాణా ప్రణాళిక, సరకు రవాణా ప్రవాహాల విశ్లేషణ, ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఉపయోగించనుంది.

### "ఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్ల గ్రోత్ ఫండ్"

చిన్న, మధ్యతరహా సంస్థలకు దీర్ఘకాలిక పెట్టుబడి అందించేందుకు ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌కు రూ. 10 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడి కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిధి "ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్" రూపంలో ఏర్పాటు కానుంది. సాధారణ రుణం కంటే భిన్నంగా, వృద్ధి దశలో ఉన్న సంస్థలకు ఈక్విటీ రూపంలో దీర్ఘకాలిక మూలధనాన్ని అందించడం దీని ప్రధాన ఉద్దేశం.

ప్రత్యేకంగా తయారీ రంగంలోని చిన్న, మధ్యతరహా సంస్థలకు ఈ నిధిలో ఎక్కువ భాగం కేటాయించేలా ప్రణాళిక రూపొందించారు. అలాగే "టెక్నాలజీ ఆధునికీకరణ, ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశం, గ్లోబల్ వాల్యూ చైన్లలో భాగస్వామ్యం" వంటి అవసరాలకు నిధులను వినియోగించుకునేఅవకాశం ఉంటుంది. టైర్-2, టైర్-3 నగరాల్లోని పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న ఎస్ఎంఈలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న అనేక ఈక్విటీ నిధులు ప్రారంభదశలోని సంస్థలు, మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లపై ఎక్కువగా దృష్టి పెడుతున్న నేపథ్యంలో.. వృద్ధి దశలో ఉన్న చిన్న, మధ్యతరహా సంస్థలకు దీర్ఘకాలిక రిస్క్ క్యాపిటల్ అందుబాటులో లేకపోవడం సమస్యగా ఉందని కేంద్రం పేర్కొంది. ఈ లోటును భర్తీ చేయడమే ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ లక్ష్యంగా తెలిపింది.

### మోదీ 25 ఏళ్ల ప్రజా సేవపై కేబినెట్ తీర్మానం

ఇదే సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ "ప్రభుత్వాధినేతగా 25ఏళ్ల నిరంతర నాయకత్వాన్ని పూర్తి చేసిన సందర్భంగా" కేంద్ర కేబినెట్ ప్రత్యేక అభినందనతీర్మానంకూడా చేసింది.గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం నుంచి ప్రధానమంత్రిగా కొనసాగుతున్నకాలం వరకు పలు కార్యక్రమాలు, సంస్కరణలను ఈ తీర్మానం ప్రస్తావించింది. రవాణామౌలిక సదుపాయాల సమగ్ర ప్రణాళిక,లాజిస్టిక్స్ సామర్థ్యం పెంపు, మరోవైపు ఎస్ఎంఈలకు దీర్ఘకాలిక మూలధన మద్దతు.. ఈ రెండు నిర్ణయాలు దేశ మౌలిక వసతులు, తయారీ రంగం, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వృద్ధికి సంబంధించి కేంద్రం తీసుకున్న తాజా చర్యలుగా నిలిచాయి.

# ఈసీ కార్యాలయం వైపు ఇండియా కూటమి ర్యాలీ.. అడ్డుకున్న పోలీసులు!

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు మంగళవారం ఢిల్లీలో ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వచన్ సదన్' వరకు మార్చ్ నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఆకాశవాణి భవన్ వద్దకు చేరుకున్న నేతలు.. అక్కడి నుంచి పార్లమెంట్ సమీపంలోని మకర్ ద్వార్ మీదుగా ఈసీ కార్యాలయం వైపు బయలుదేరారు. అయితే నీతి ఆయోగ్ కార్యాలయం సమీపంలో పోలీసులు వారిని




అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే నిరసనకు దిగారు. కొందరు బారికేడ్లపైకి ఎక్కి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నేతలు ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నినదించారు. రాహుల్ గాంధీ కూడా సీఈసీపై విమర్శలు చేస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ఎన్నికల సంఘం స్వతంత్రతను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ.. నిబంధనల ప్రకారమే ప్రక్రియ కొనసాగుతోందని చెబుతోంది.

## ట్రిపుల్ మర్డర్ కేసు: హత్యలకు ముందు ఏఐతో రిహార్సల్స్!

బెంగళూరు పరిధిలోని కెఆర్ పురలో జూన్‌లో జరిగిన ట్రిపుల్ మర్డర్ కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనను స్వేచ్ఛగా బతకనివ్వడంలేదని.. ప్రియుడు కెనెత్‌తో కలిసి శ్వేత అనే యువతి.. తన తండ్రి సోమసుందర, తల్లి ముత్తులక్ష్మి, చెల్లెలు సుప్రియను దారుణంగా హత్య చేసిన ఘటన సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు కీలక విషయాలు బయట పెట్టారు. ఏఐని ఉపయోగించి నిందితుడు ఈ హత్యలకు పాల్పడినట్టు గుర్తించారు. నిందితుడు, టెకీ కెనెత్ ల్యాప్‌టాప్‌లోని సెర్చ్ హిస్టరీని పరిశీలించగా.. "వ్యక్తులపై ఎలా దాడి చేయాలి..? వారిని ఎలా అదుపులోకి తీసుకోవాలి..? వంటి అంశాలను ఏఐని అడిగినట్టు తేలిందని పోలీసులు చెప్పారు.

కెనెత్ ఏఐని అడిగిన ప్రశ్నల్లో.. వంటగదిలో ఉపయోగించే కత్తితో దాడి చేయడం.. ముగ్గురిపై ఒకేసారి దాడికి పాల్పడటం.. వెనిగర్, కారంపొడితో కంటిచూపు కోల్పోయేలా చేయడం.. మోకాళ్ళ విరగ్గొట్టడంవంటి అంశాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన ఆయుధాల గురించి కూడా అతడు అన్వేషించినట్టు వెల్లడించారు. అయితే అతడికి ఏఐ నుంచి





ఎలాంటి సమాధానాలు వచ్చాయనేది స్పష్టంగా తెలియలేదని పేర్కొన్నారు. ఛార్జ్ ప్రకారం.. కెనెత్ కోసం శ్వేత సుమారు రూ.52 లక్షల వరకు అప్పు చేసింది. ఆ విషయం ఆమె తల్లిదండ్రులకు తెలియడంతో కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలోనే ఈ దారుణం జరిగింది.

# నిద్రపోతే.. రూ.12 లక్షలు!

జపాన్‌లో ఓ వింత పోటీ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సాధారణంగా పోటీల్లో గెలవాలంటే పరుగెత్తాలి, ఆడాలి, ఏదైనా టాలెంట్ చూపించాలి. కానీ ఇక్కడ మాత్రం గెలవాలంటే 'గాఢంగా నిద్రపోవాలి!'. టోక్యోలో 'మ్యాట్ రేస్' పేరుతో ఓ పరుపుల తయారీ సంస్థ నిర్వహించిన పోటీలో విజేతకు రెండు మిలియన్ యెన్లకు పైగా.. అంటే భారత కరెన్సీలో సుమారు రూ.12 లక్షల బహుమతి అందించారు. తాజాగా జరిగిన ఈ పోటీలో తమను తాము 'కాంపిటేటివ్ స్లీపర్స్'గా పిలుచుకునే డజన్లమంది పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో తక్కువ వెలుతురు, సౌకర్యవంతమైన పరుపుల మధ్య 90 నిమిషాలపాటు నిద్రపోయారు. ప్రతి ఒక్కరి తలకు స్లీప్ ట్రాకింగ్ పరికరాలను అమర్చారు. ఎవరు ఎంత వేగంగా నిద్రలోకి జారుకున్నారు? ఎంత గాఢంగా నిద్రపోయారు? అనే అంశాల ఆధారంగా విజేతను ఎంపిక చేశారు. కొందరు తమకు ఇష్టమైన టెడ్డీబేర్లను పక్కన పెట్టుకుని మరీ నిద్రపోవడం విశేషం. జపాన్ ప్రజల్లో నిద్రపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు 'కోలా స్లీప్ జపాన్' క్రియేటివ్ డైరెక్టర్ రిచిరో నకమా తెలిపారు. జపనీయులు ఎక్కువగా పనిచేస్తూ నిద్రకు తక్కువ సమయం కేటాయిస్తున్నారని.. నిద్రను ఇలా సరదా పోటీగా మార్చడం ద్వారా దానిపై ఆసక్తిని పెంచాలనుకున్నామని చెప్పారు. ఓఈసీడీ 2021 డేటా ప్రకారం జపనీయులు రోజుకు సగటున 7 గంటల 24 నిమిషాలు మాత్రమే నిద్రపోతున్నారు. ఓఈసీడీ దేశాల్లో ఇదే అత్యల్ప సగటు నిద్ర సమయం. ఈ పోటీలో పాల్గొన్న 32 ఏళ్ల చిసాటో హోండా.. 90 నిమిషాలు ఇట్టే గడిచిపోయాయని, ఇంకాస్త ఎక్కువసేపు నిద్రపోతే బాగుండేదని చెప్పడం విశేషం. ఇక 'సుయిమీ' అనే మహిళ ఈ వింత పోటీలో విజేతగా నిలిచి రూ.12 లక్షలకుపైగా బహుమతి అందుకున్నారు. ఆ డబ్బుతో ప్రత్యేకంగా ఇల్లు తీసుకుని.. యువరాణి బెడ్‌లాంటి ఓ బెడ్ కొనుక్కుంటానని ఆనందంగా తెలిపారు.



# హార్ముజ్ వద్ద నౌకపై దాడి.. 11 మంది భారతీయులకు గాయాలు

హార్ముజ్ జలసంధి వద్ద వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో 11 మంది భారతీయ సిబ్బంది గాయపడ్డారు. ఒమన్ తీరంలో మంగళవారం ఘటన చోటుచేసుకున్నట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. పనామాకు చెందిన 'ఎంటీ ఆన్ పీస్' అనే వాణిజ్య నౌకపై గుర్తుతెలియని వస్తువుతో దాడి జరిగినట్లు తెలిపింది. దాడి జరిగిన సమయంలో నౌకలో మొత్తం 19 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 17మంది భారతీయులున్నారు. ఈ ఘటనలో 12 మంది గాయపడగా.. వారిలో 11 మంది భారతీయులేనని కేంద్రం పేర్కొంది. సమాచారం అందుకున్న వెంటనే ఒమన్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. నౌక వద్దకు చేరుకుని గాయపడిన వారిని రక్షించి, ఖసాబ్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది. ఈ దాడిని భారత్ ఖండించింది. గాయపడిన భారతీయులను సురక్షితంగా రక్షించినందుకు ఒమన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. హార్ముజ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై వరుసగా దాడులు జరుగుతుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే కాల్పుల విరమణ పాటించి.. ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పాలని భారత్ ఆకాంక్షించింది. వాణిజ్య నౌకలు, సాధారణ ప్రజలు, మౌలిక వసతులపై దాడులు చేయడం సరికాదని పేర్కొంటూ.. అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగాలని భారత్ స్పష్టం చేసింది. కాగా, ఈ దాడికి పాల్పడింది ఎవరు? ఏ వస్తువుతో దాడి చేశారు? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.



# రైళ్లపైనా రష్యా గురి..

**ఉక్రెయిన్‌కు పెరుగుతున్న కష్టాలు!**

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతున్న నేపథ్యంలో.. ఉక్రెయిన్‌లో పౌర విమాన సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. క్షిపణి, డ్రోన్ దాడుల ముప్పు కారణంగా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రజలు ప్రధానంగా రైళ్లు, బస్సులపైనే ఆధారపడుతున్నారు. అధికారిక పర్యటనలకు వచ్చే విదేశీ నేతలు సైతం రైళ్లలోనే ప్రయాణిస్తున్నారు. దీంతో కర్మాగారాలు, ఓడరేవులు, వంతెనలతో పాటు రైల్వే వ్యవస్థ కూడా రష్యా దాడులకు గురవుతోందని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. ఈ దాడుల కారణంగా వందలాది లోకోమోటివ్‌లు ధ్వంసమైనట్లు ఉక్రెయిన్ రైల్వే చెబుతోంది. ప్రతినెలా డజన్ల కొద్దీ రైలు ఇంజిన్లను కోల్పోతున్నామని వెల్లడించింది. దీంతో యుద్ధం కారణంగా ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశంపై రవాణా వ్యవస్థను కొనసాగించడం అదనపు భారంగా మారింది. మరిన్ని లోకోమోటివ్‌ల కోసం ఉక్రెయిన్ ప్రస్తుతం యూరప్ దేశాలతో చర్చలు జరుపుతోంది. మరోవైపు.. ఓడరేవులపై దాడులు సముద్ర వాణిజ్యాన్నీ దెబ్బతీస్తున్నాయి. ధాన్యం, ఇనుప ఖనిజం, ఇతర సరుకులను ఉత్పత్తి కేంద్రాల నుంచి ఓడరేవులకు తరలించేందుకు తగినన్ని రైళ్లు అందుబాటులో లేకపోవడంతో వ్యాపార కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. నల్ల సముద్రంలోని ప్రధాన ఓడరేవుల్లో ఒకటైన పివెన్నీ పరిసరాల్లో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది.

యుద్ధానికి ముందు ఉక్రెయిన్ ధాన్యం ఎగుమతుల్లో నల్ల సముద్ర ఓడరేవులదే కీలక పాత్ర. అయితే తరచూ జరుగుతున్న దాడులతో ఓడరేవుల మౌలిక వసతులతో పాటు.. వ్యవసాయ, పారిశ్రామిక ప్రాంతాలను తీరానికి అనుసంధానించే రవాణా మార్గాలు దెబ్బతిన్నాయి. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తగ్గి రైతులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారు. ఇదే సమయంలో రష్యా దాడుల భయంతో కొన్ని మైనింగ్, ఉక్కు కర్మాగారాలు కార్యకలాపాలను నిలిపివేస్తుండటంతో ఉపాధిపైనా ప్రభావం పడుతోంది. కదులుతున్న రైళ్లను లక్ష్యంగా చేసుకునేందుకు జెట్-పవర్డ్ డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. వాటిని ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలతో అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో సాధ్యం కావడం లేదని చెబుతోంది. పోర్ట్ ఆపరేటర్ టీబీఎస్ సీఈఓ మైకిటా హ్రుబోవ్ ప్రకారం.. రష్యా దాడుల్లో తమ టెర్మినల్ పరిసరాల్లో మూడు లోకోమోటివ్‌లు ధ్వంసమయ్యాయి. దీంతో యుద్ధం ఉక్రెయిన్ రవాణా వ్యవస్థపై చూపుతున్న ప్రభావం రోజురోజుకూ మరింత తీవ్రమవుతోంది.



# న్యూట్రినోల వేట.. నోబెల్ విజేతగా ఫ్రాన్సిస్ హాల్జెన్



భౌతిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు దక్కింది. దక్షిణ ధ్రువంలో ఏర్పాటు చేసిన 'ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ'కి అందించిన కీలక సహకారంతో పాటు.. ఖగోళం నుంచి వచ్చే అత్యంత శక్తివంతమైన న్యూట్రినోలను గుర్తించి అధ్యయనం చేయడంలో ఆయన చేసిన కృషికి ఈ పురస్కారం లభించింది. అమెరికాలోని మాడిసన్‌లో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్జెన్.. ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ రూపకల్పన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. దక్షిణ ధ్రువంలోని భారీ మంచు పొరలను ఉపయోగించి న్యూట్రినోలను గుర్తించవచ్చన్న ఆలోచనను ఆయన ముందుకు తీసుకెళ్లారు. అనంతరం ఇదే సాంకేతికతతో విశ్వంలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే న్యూట్రినోలను గుర్తించే పరిశోధనలు ఊపందుకున్నాయి. న్యూట్రినోలు అత్యంత సూక్ష్మ కణాలు. ఇవి పదార్థంతో చాలా అరుదుగా మాత్రమే చర్య జరపడంతో వాటిని గుర్తించడం శాస్త్రవేత్తలకు పెద్ద సవాలుగా ఉంటుంది. అయితే ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీలోని భారీ మంచు పొరలలో న్యూట్రినోలు సృష్టించే సంకేతాలను గుర్తించడం ద్వారా వాటి మూలాలను అధ్యయనం చేస్తున్నారు. ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీలో హాల్జెన్ విజన్, నాయకత్వం కీలకంగా నిలిచాయని నోబెల్ కమిటీ పేర్కొంది. విశ్వంలోని అత్యంత శక్తివంతమైన ఘటనలపై కొత్త విషయాలను తెలుసుకోవడానికి న్యూట్రినోలు కీలక ఆధారాలుగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# డ్రోన్లను అడ్డుకునేందుకు.. చేపల వలలు!

ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న పాకిస్థాన్.. డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు వింత మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. చేపలు పట్టేందుకు ఉపయోగించే వలలనే ఇప్పుడు డ్రోన్లను అడ్డుకునేందుకు వినియోగిస్తోంది. అఫ్గానిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని సైనిక పోస్టులను డ్రోన్ దాడుల నుంచి కాపాడుకునేందుకు ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అఫ్గానిస్థాన్‌కు ఆనుకుని ఉన్న ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రాంతంలో పాకిస్థాన్ తాలిబన్ (టీటీపీ) చురుగ్గా ఉన్నట్లు పాక్ భావిస్తోంది. భద్రతా దళాలపై జరుగుతున్న వరుస దాడుల వెనుక టీటీపీ హస్తం ఉందని అనుమానిస్తోంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ దాడులు పెరుగుతుండటంతో వాటిని ఎదుర్కొనేందుకు ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ఈ తాత్కాలిక పరిష్కారాన్ని సూచించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి.

**వలల్లో చిక్కుకుంటే.. అంతే!**

సాధారణంగా డ్రోన్లను ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, రాడార్లు, జామర్లు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు. అయితే ఖరీదైన వ్యవస్థలకు బదులుగా పాక్ సైన్యం.. చెక్‌పోస్టుల పైకప్పులు, ప్రహరీ గోడల మధ్య చేపల వలలను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. డ్రోన్లు తక్కువ ఎత్తులో పోస్టులపైకి వచ్చినప్పుడు ఈ వలల్లో చిక్కుకుని కదలిక కోల్పోయేలా చేయడం దీని ఉద్దేశం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్‌కు ఇది చౌకైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నప్పటికీ.. పూర్తిస్థాయి రక్షణ కల్పించలేదని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డ్రోన్‌ను గాలిలోనే గుర్తించి.. దాని దిశను మార్చడం లేదా నిర్వీర్యం చేయగల శాశ్వత సాంకేతిక వ్యవస్థలు అవసరమని వారు సూచిస్తున్నారు. కేవలం చేపల వలలపై ఆధారపడటం సైనికుల భద్రతకు పూర్తి హామీ ఇవ్వదని హెచ్చరిస్తున్నారు.



# శ్రేయస్ శతక ధమాకా.. విండీస్‌పై భారత్ ఘన విజయం




లక్నో: శ్రేయస్ అయ్యర్ విధ్వంసక శతకంతో భారత జట్టు వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌ను ఘనంగా ఆరంభించింది. లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. తొలుత బౌలింగ్‌లో అదరగొట్టిన టీమిండియా.. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్ మెరుపు బ్యాటింగ్‌తో లక్ష్యాన్ని కేవలం 14.4 ఓవర్లలోనే ఛేదించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. విండీస్ ఆరంభంలోనే తడబడింది. పవర్‌ప్లేలో 44 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అయితే షై హోప్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. హోప్ 37 బంతుల్లో 52 పరుగులు చేయగా.. రూథర్‌ఫోర్డ్ 34 బంతుల్లో 56 పరుగులతో వేగంగా ఆడాడు. దీంతో ఒక దశలో భారీ స్కోరు చేసేలా కనిపించిన విండీస్‌ను భారత బౌలర్లు మళ్లీ కట్టడి చేశారు. భారత్ తరపున అరంగేట్రం చేసిన నామన్ ధీర్ అదిరిపోయే ప్రదర్శన చేశాడు. నాలుగు ఓవర్లలో 31 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. దీంతో విండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది.

172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు మాత్రం ఆరంభం ఆశించిన స్థాయిలో సాగలేదు. అభిషేక్ శర్మ 21 పరుగులు చేసి వెనుదిరగగా.. సంజు శాంసన్ 11 పరుగులకే ఔటయ్యాడు. దీంతో భారత్ 35 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో శ్రేయస్ అయ్యర్ ఇన్నింగ్స్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత ఏకానా స్టేడియంలో శ్రేయస్ శతక ధమాకా కనిపించింది. కేవలం 43 బంతుల్లోనే 102 పరుగులతో అజేయంగా నిలిచిన శ్రేయస్.. తన ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు బాదాడు. 42 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్న అతడు.. విండీస్‌పై టీ20ల్లో భారత ఆటగాడు సాధించిన అత్యంత వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. ఇది శ్రేయస్ అయ్యర్‌కు టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో తొలి శతకం.

మరోవైపు ఇషాన్ కిషన్ కూడా కెప్టెన్‌కు అద్భుతంగా సహకరించాడు. 27 బంతుల్లో 37 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. శ్రేయస్, ఇషాన్ కలిసి మూడో వికెట్‌కు 137 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో భారత్ 14.4 ఓవర్లలోనే 172/2 స్కోరు చేసి విజయాన్ని అందుకుంది. లక్ష్యాన్ని ఛేదించడానికి ఇంకా 32 బంతులు మిగిలి ఉండటం భారత బ్యాటింగ్ ఆధిపత్యాన్ని స్పష్టం చేసింది. విండీస్‌పై ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో టీ20 అక్టోబర్ 9న రాంచీలో జరగనుంది. తొలి మ్యాచ్‌లో బౌలింగ్‌లో నామన్ ధీర్ ఆకట్టుకోగా.. బ్యాటింగ్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సెంచరీతో మెరిసి భారత్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు.




## కెప్టెన్సీకి ప్రీత్ వీడ్కోలు..

**- ఆటకు మాత్రం కాదన్న హర్మన్**

భారత మహిళల క్రికెట్‌లో సుదీర్ఘకాలం నాయకత్వం వహించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు మంగళవారం ప్రకటించారు. అయితే, క్రికెటర్‌గా తన ప్రయాణాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె సుదీర్ఘ భావోద్వేగ పోస్ట్ చేశారు. కెప్టెన్‌గా తన కర్తవ్యం పూర్తయిందని భావిస్తున్నట్టు హర్మన్‌ప్రీత్ తెలిపారు.



జట్టు ప్రయోజనాల కోసం ఎన్నో సందర్భాల్లో వ్యక్తిగత ఆశయాలను పక్కన పెట్టాల్సి వచ్చిందని, కఠిన నిర్ణయాలు తీసుకున్నానని పేర్కొన్నారు. కెప్టెన్సీ ప్రయాణంలో విమర్శలు, క్లిష్ట పరిస్థితులు, ఎత్తుపల్లాలు ఎదుర్కొన్నప్పటికీ.. దేశం గర్వించే విజయాలను ఆస్వాదించానని చెప్పారు. ప్రస్తుతం జట్టు మంచి స్థాయిలో ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారిణులు భవిష్యత్తుపై నమ్మకం కలిగిస్తున్నారని తెలిపారు.

2012లో తొలిసారి తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన హర్మన్‌ప్రీత్.. అదే ఏడాది టీ20 ఆసియా కప్ టైటిల్ సాధించారు. 2016లో పూర్తిస్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె నాయకత్వంలో భారత మహిళల జట్టు "5 టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20లు" ఆడింది. గతేడాది వన్డే ప్రపంచకప్ విజయం, ఇటీవల ఆసియా క్రీడల్లో వరుసగా రెండో స్వర్ణం సాధించడం ఆమె కెప్టెన్సీ ప్రయాణంలో కీలక మైలురాళ్లుగా నిలిచాయి.

"నా కెప్టెన్సీ మాత్రమే పూర్తయింది.. క్రికెట్‌పై నా ప్రేమకు మాత్రం ముగింపు లేదు. ఈ ఆటతో నా ప్రయాణం మరింతకాలం కొనసాగుతుంది" అని హర్మన్‌ప్రీత్ స్పష్టం చేశారు. జట్టుసభ్యులు, కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్, మేనేజ్‌మెంట్, బీసీసీఐ, కుటుంబసభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## 2036 ఒలింపిక్స్.. భారత్‌కు గట్టి పోటీ!

న్యూఢిల్లీ: ఒలింపిక్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలన్న భారత్ కల మరింత ముందడుగు వేసింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య రేసులో భారత్, ఖతార్‌తోపాటు మరో ఐదు దేశాలున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ధ్రువీకరించింది. 2029లో జరిగే ఓటింగ్ ద్వారా ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతానికి భారత్, ఖతార్ ఫేవరెట్లుగా ఉన్నట్లు ఐఓసీ వర్గాలు పేర్కొన్నాయి. 2036 ఒలింపిక్స్ కోసం భారత్ అహ్మదాబాద్‌ను ప్రధాన వేదికగా ప్రతిపాదిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం ఉన్న అహ్మదాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో భారత్ ముందుకెళ్తోంది. 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు కూడా భారత్ ఆతిథ్యం ఇవ్వనుండటం అదనపు అనుభవంగా మారనుంది. భారత్‌కు ప్రధాన పోటీదారుగా ఖతార్ నిలుస్తోంది. 2022 ఫిఫా ప్రపంచకప్‌కు దోహా ఆతిథ్యం ఇవ్వడంతో పాటు భారీ అంతర్జాతీయ క్రీడా ఈవెంట్ల నిర్వహణలో ఆ దేశానికి అనుభవముంది. ఇక దక్షిణ కొరియా సియోల్ వేదికగా బిడ్ వేస్తోంది. సియోల్ ఇప్పటికే 1988 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చింది.



జర్మనీ మ్యూనిచ్‌ను వేదికగా ప్రతిపాదించే ప్రయత్నాల్లో ఉంది. 1972లో మ్యూనిచ్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. మరోవైపు దక్షిణాఫ్రికా ఒలింపిక్స్‌ను నిర్వహించిన తొలి ఆఫ్రికా దేశంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. హంగరీ, తుర్కియే కూడా వరుసగా బుడాపెస్ట్, ఇస్తాంబుల్ నగరాలతో బరిలో ఉన్నాయి. 2036కే కాకుండా 2040, 2044 ఒలింపిక్స్ ఆతిథ్యానికి కూడా కొన్ని దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనే దేశాలకు మార్గదర్శకంగా ఐఓసీ 30 పేజీల డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 31 వరకు బిడ్ల దాఖలుకు గడువుంది. 2028 ఒలింపిక్స్ లాస్ ఏంజెలెస్‌లో, 2032 క్రీడలు బ్రిస్బేన్‌లో జరగనున్నాయి. ఇక 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు ఎవరికి దక్కుతాయన్నది 2029లో తేలనుంది.

## -ఆర్కిటిక్ ఓపెన్- బరిలో భారత షట్లర్లు

వాంటా (ఫిన్లాండ్): ప్రతిష్ఠాత్మక ఆర్కిటిక్ ఓపెన్ 2026 బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారం ఫిన్లాండ్‌లోనివాంటాలో ప్రారంభమైంది. బీడబ్ల్యుఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500హోదాలో జరుగుతున్న టోర్నీలో ప్రపంచ అగ్రశ్రేణి షట్లర్లు బరిలోకి దిగారు. తొలి రోజు క్వాలిఫికేషన్ మ్యాచ్‌లతోపాటు ప్రధాన డ్రాలోని కొన్ని పోటీలు జరిగాయి. భారత్ నుంచి పలువురు షట్లర్లు ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. యువ షట్లర్ రౌనక్ చౌహాన్ క్వాలిఫికేషన్‌లో డానియెల్ దుబోవెంకో పై మూడు గేమ్‌ల పోరులో విజయం సాధించి ముందంజ వేశాడు. మరోవైపు మహిళల విభాగంలో ఉన్నతి హుడా,తన్వి శర్మ, అశ్మిత చలిహా తదితరులు ప్రధాన డ్రాలో పోటీ పడుతున్నారు. ఇక భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుపై కూడా అందరి దృష్టి ఉంది. ఇటీవల జపాన్ ఓపెన్‌లో టైటిల్ సాధించిన సింధు.. అదే జోరును ఆర్కిటిక్ ఓపెన్‌లోనూ కొనసాగించాలని భావిస్తోంది. ఆసియా క్రీడల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో భారత షట్లర్లకు ఈ టోర్నీ తమను తాము నిరూపించుకునేందుకు మరో కీలక అవకాశంగా మారింది. ఆదివారం జరిగే ఫైనల్స్‌తో ఆర్కిటిక్ ఓపెన్ ముగియనుంది.



# రవితేజకు విలన్‌గా.. జేడీ!



రవితేజ వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన.. దర్శకుడు వివేక్ ఆత్రేయతో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. దిల్ రాజు నిర్మించనున్న ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు టాక్. కొంతకాలంగా ఈ సినిమాకు 'తులాభారం' టైటిల్ ప్రచారంలో ఉన్నప్పటికీ.. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఆసక్తికరమైన కాస్టింగ్ న్యూస్ వినిపిస్తోంది. రవితేజ సరసన ప్రియాంక మోహన్‌ను కథానాయికగా ఎంపిక చేసినట్టు సమాచారం. మరోవైపు మలయాళ యువ నటి అనస్వర రాజన్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. కథలో ఆమె పాత్రకు మంచి ప్రాధాన్యత ఉంటుందని టాక్. ఇప్పటికే వీరిద్దరిపై ఫొటోషూట్ కూడా నిర్వహించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌లో అసలు ఆసక్తిని పెంచుతున్న అంశం విలన్ పాత్ర. రవితేజకు ధీటుగా సాగే పవర్‌ఫుల్ నెగెటివ్ రోల్ కోసం జేడీ చక్రవర్తి పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. హీరో పాత్రకు సమానమైన ప్రాధాన్యత ఉండేలా ఈ క్యారెక్టర్‌ను దర్శకుడు వివేక్ ఆత్రేయ డిజైన్ చేస్తున్నారని టాక్. జేడీ చక్రవర్తి గతంలో పలు విభిన్న పాత్రలతో మెప్పించారు. ఇప్పుడు రవితేజకు ఎదురుగా ఆయన కనిపిస్తే.. వీరిద్దరి మధ్య సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారే అవకాశం ఉంది. వివేక్ ఆత్రేయ తన సినిమాల్లో కథతో పాటు పాత్రల రూపకల్పనకు ప్రాధాన్యత ఇస్తుండటంతో 'తులాభారం'పై ఆసక్తి పెరుగుతోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ సినిమాకు సంబంధించి టైటిల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.




# 'రణబాలి'.. నాన్‌స్టాప్ ప్రమోషన్స్!

సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ హిస్టారికల్ మూవీ 'రణబాలి'. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక పాన్ ఇండియా రిలీజ్‌కు తగ్గట్టుగానే 'రణబాలి' ప్రమోషన్స్‌ను భారీగా ప్లాన్ చేసినట్టు చెబుతున్నారు. అక్టోబర్ 8న ట్రైలర్ లాంచ్‌తో మొదలయ్యే ప్రమోషన్ కార్యక్రమాలు.. సినిమా విడుదలకు ముందు రోజు వరకు నాన్‌స్టాప్‌గా కొనసాగనున్నాయట. దాదాపు అన్ని ప్రధాన భాషల్లోనూ టీమ్ విస్తృతంగా ప్రమోషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ మార్కెట్లను టార్గెట్ చేస్తూ 'రణబాలి'ని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లనున్నారు. విజయ్ దేవరకొండకు ఇప్పటికే నార్త్ మార్కెట్‌లో మంచి క్రేజ్ ఉండగా.. రష్మిక మందన్నాకు కూడా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు ఉంది. దీంతో వీరిద్దరి కాంబినేషన్ ఈ హిస్టారికల్ మూవీకి అదనపు బజ్ తీసుకొచ్చే అవకాశం ఉంది. కంటెంట్‌తో పాటు భారీస్థాయిలో ప్రమోషన్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్న మేకర్స్.. పాన్ ఇండియా బాక్సాఫీస్‌పై గట్టి టార్గెట్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. మరి విజయ్-రష్మికల కాంబినేషన్, రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కించిన హిస్టారికల్ డ్రామా ఇతర భాషల ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# కామెడీతో పాటు.. థ్రిల్ కూడా!




టాలీవుడ్‌లో తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేకగుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు హీరోగా నటించిన తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహించిన సినిమా అక్టోబర్ 9న థియేటర్లకు రానుంది. ఈనేపథ్యంలో తాజాగా మేకర్స్ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. చూస్తుంటే కామెడీతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తోనూ సినిమా ప్రామిసింగ్‌గా కనిపిస్తోంది. ట్రైలర్ బాలయ్య వీరాభిమాని పాత్రలో రాధికతో శ్రీవిష్ణుపై వచ్చే ఫన్ ట్రాక్‌తో మొదలవుతుంది. అక్కడి నుంచి శ్రీవిష్ణు తనదైన కామెడీ టైమింగ్‌తో ట్రైలర్‌ను ముందుకు తీసుకెళ్లాడు. కమెడియన్స్‌తో వచ్చే ఫన్ సీన్స్‌తోపాటు హీరోయిన్ మహిమా నంబియార్‌తో శ్రీవిష్ణు సన్నివేశాలు కూడా ఎంగేజింగ్‌గా ఉన్నాయి. అయితే కామెడీ ట్రాక్‌తో పాటు 'కామ్రేడ్ కళ్యాణ్' టైటిల్‌కు తగ్గట్టుగా శ్రీవిష్ణు పాత్రకు సంబంధించిన నక్సలైట్ ఫ్లాష్‌బ్యాక్‌ను కూడా ట్రైలర్‌లో చూపించారు. అసలు అతడి పాత్ర ఆ మార్గంలోకి ఎందుకువెళ్లింది? ఆ ఫ్లాష్‌బ్యాక్‌కు ప్రస్తుతకథతో ఉన్న సంబంధం ఏమిటన్నది ఆసక్తికరం. ఈ ఎపిసోడ్ సినిమాకు థ్రిల్ యాంగిల్‌ను తీసుకొచ్చేలా కనిపిస్తోంది. మలయాళ నటుడు షైన్ టామ్ చాకో, 'యానిమల్' ఫేమ్ ఉపేంద్ర లిమాయే, బుల్లిరాజు తదితరులు కీలకపాత్రల్లో కనిపిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ అందించిన నేపథ్య సంగీతం,పాటలు కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. స్వందవాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, కోనా ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మించిన సినిమా అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకురానుంది.



# 'ఆర్సీ17'.. మైథాలజీ టచ్?

రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబోలో 'ఆర్సీ17' ప్రాజెక్టు రానున్న సంగతి తెలిసిందే. 'రంగస్థలం' తర్వాత వీరిద్దరి కలయిక కావడంతో ప్రాజెక్టుపై అంచనాలు భారీగా ఉన్నాయి. సినిమా ఎప్పుడు మొదలవుతుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న వేళ.. తాజాగా 'ఆర్సీ17' జానర్‌కు సంబంధించి ఓ క్రేజీ రూమర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే సినిమా స్క్రిప్ట్ విషయంలో సుకుమార్ పలు వర్షన్లపై వర్క్ చేస్తున్నారనే టాక్ ఉంది. తొలుత ఇది ఇంటెన్స్ యాక్షన్‌తో కూడిన గ్యాంగ్‌స్టర్ డ్రామా అంటూ వార్తలొచ్చాయి. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రచారం మొదలైంది. 'ఆర్సీ17'కు మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌ను సుకుమార్ ఎంచుకున్నారనేది తాజా రూమర్. నిజానికి రామ్‌చరణ్‌ను మైథాలజీ టచ్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో చూడాలని అభిమానులు చాలాకాలంగా కోరుకుంటున్నారు. ఆయన ఇమేజ్‌కు తగ్గ సాలిడ్ కాన్సెప్ట్ కుదిరితే.. ఈ జానర్‌లో చరణ్ మరో రేంజ్‌లో కనిపించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ రూమర్ నిజమైతే సినిమాపై అంచనాలు మరింత పెరగడం ఖాయం. అయితే 'ఆర్సీ17' కథ, జానర్‌కు సంబంధించి ఇప్పటివరకు మేకర్స్‌నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి మైథాలజీ బ్యాక్‌డ్రాప్ అన్నది ప్రస్తుతానికి రూమర్‌గానే చూడాలి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా సందర్భంగా ముహూర్త కార్యక్రమాలతో ప్రారంభం కానుందని టాక్. అసలు సుకుమార్ ప్లాన్ ఏంటనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ కన్ఫ్యూజన్ కనిపించేది, వినిపించేదే!

# 'రామాయణ'.. ట్రైలర్-2 వచ్చేస్తుందా?



భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ ప్రాజెక్టుల్లో 'రామాయణ' ఒకటి. బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఎపిక్ మూవీలో రణ్‌బీర్‌కపూర్, సాయి పల్లవి, యష్ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న చిత్రంలో తొలి భాగాన్ని దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచేలా ట్రైలర్‌ను విడుదల చేశారు. విజువల్స్, భారీ సెట్స్, పాత్రల లుక్స్‌తో ఈ ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. ఇక ఇప్పుడు 'రామాయణ' నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వినిపిస్తోంది. త్వరలోనే ట్రైలర్-2ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారనే బజ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రానున్న కొద్ది రోజుల్లోనే రెండో ట్రైలర్ ప్రేక్షకుల ముందుకు రావచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్త ఎంతవరకు నిజమన్నది తెలియాలంటే మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సిందే. ఇక 'రామాయణ'కు హాలీవుడ్ స్టార్ కంపోజర్ హాన్స్ జిమ్మర్ తోపాటు ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూరుస్తున్నారు. నమిత్ మల్హోత్రా, యష్ భారీస్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. మరి ట్రైలర్-2లో మేకర్స్ ఇంకెన్ని సర్‌ప్రైజులు చూపించబోతున్నారో చూడాలి.

# మళ్లీ సెట్స్‌లోకి బాలయ్య

నందమూరి బాలకృష్ణ హీరోగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దాదా'. జులైలో ఈ సినిమా షూటింగ్ సందర్భంగా బాలకృష్ణ గాయపడటంతో కొంతకాలం చిత్రీకరణకు దూరంగా ఉన్నారు. తాజాగా ఆయన మళ్లీ సెట్స్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం మైసూర్‌లో జరుగుతున్న కీలక షెడ్యూల్‌లో బాలయ్య పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణతోపాటు పలువురు నటులు పాల్గొంటుండగా.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. దీంతో షూటింగ్ తిరిగి జోరందుకున్నట్లు తెలుస్తోంది. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలిసి పనిచేస్తున్న సినిమా కావడంతో 'దాదా'పై మంచి అంచనాలు ఉన్నాయి. బాలయ్యను మరింత మాస్ యాక్షన్ అవతార్‌లో చూపించేందుకు దర్శకుడు ఈ చిత్రాన్ని స్టైలిష్ కమర్షియల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, బాలయ్య లుక్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రంలో బాలకృష్ణకు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తుండగా.. మంచు మనోజ్ కీలకపాత్రలో కనిపించనున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న'దాదా'ను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. బాలయ్య రీఎంట్రీతో షూటింగ్ మరింత వేగం పుంజుకోవడంతో అభిమానుల్లోనూ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది.

